www.udyamakeratam.com

ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత: UDYAMA KERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 136 | 8-11-2026 | ఆదివారం | పేజీలు: 8 | వెల : రూ.2/-

ధాన్యం నిల్వకు ఆధునిక సైలోలు



- తేమ పరీక్ష, శుభ్రపరచడం, ఆరబెట్టడం, నిల్వకు ఒకేచోట సదుపాయాలు
- పౌర సరఫరాల సంస్థ ద్వారా నేరుగా, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుకు రెండు నమూనాలు
- సచివాలయంలో ప్రతిపాదనలను సమీక్షించిన మంత్రి ఉత్తమ్

వరి ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో ఆరబెట్టి నాణ్యతను కాపాడుతూ ఎక్కువ కాలం భద్రపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోల వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. పంట కోత తర్వాత నిల్వ నష్టాలను తగ్గించడం, మార్కెట్‌లో ధర అనుకూలించే వరకు రైతులు ధాన్యాన్ని భద్రపరచుకునే వీలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

2



ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలి

సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్

కాలుష్యానికి తావులేకుండా సురక్షితంగా వేడుకలు జరుపుకోవాలని పిలుపు

2



ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే..
రైతులూ అప్రమత్తం!



- ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు
- సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తా
- కాళేశ్వరం విధ్వంసానికి బీఆర్ఎస్ అవినీతే కారణం
- గడ్డం పెంచుకున్నంత మాత్రాన కేటీఆర్ తనలా మారలేడు
- కొడంగల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

వరి సాగుకు దూరంగా ఉండండి.. ఆరుతడి పంటలకే ప్రాధాన్యమివ్వండి


ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున రాష్ట్రంలో కూడా వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున, రైతులు వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా కేవలం ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మి రైతులు నష్టపోవద్దని కోరారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా ఈ పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వరుసగా పర్యటిస్తానని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు.

కొడంగల్, నవంబర్ 7 (ఉద్యమ కెరటం): తెలంగాణలో రాబోయే రోజుల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశముందని, ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీరు తాగునీటి అవసరాలకే సరిపోతుందని స్పష్టం చేశారు. రైతులు ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎక్కువ నీరు అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి రైతులు నష్టపోవద్దని అన్నారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరూ సమష్టిగా పరిస్థితులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో సీఎం

మిగతా 2 లో

దోచుకున్నది చాలక మళ్లీ అధికారం కోసం కలలు

- సీఎం కుర్చీ కోసం ప్రతిపక్ష నేత ప్రమాణస్వీకార రిహార్సల్స్
- ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు నింపుదాం
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి



వివరాలు ఎ2లో..

డిండి నీటి సమస్యకు నదుల అనుసంధానమే పరిష్కారం

- ఏదుల నుంచి డిండికి నీళ్లు తేవడం అసాధ్యం
- బస్వాపూర్ మీదుగా గోదావరి జలాల తరలింపు
- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

3



సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ దోపిడీ

- కొడంగల్-నారాయణపేట-మక్తల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి
- మిగతా కంపెనీలన్నీ నామమాత్రమే
- 1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిన ప్రాజెక్టు వ్యయం
- చుక్క నీరు అందకముందే ఐదు రెట్లకు చేరిన అంచనా వ్యయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3



బోస్టన్‌లో తెలంగాణ యువతి అదృశ్యం

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన శ్రీజ రెడ్డి

- నవంబర్ 2న వాకింగ్‌కు వెళ్లి కనిపించకుండా పోయిన యువతి
- భారత కాన్సులేట్, తానా సహకారం కోరిన మంత్రి కోమటిరెడ్డి

2



4.5 లక్షల మందికి కొత్తగా పింఛన్లు

- రాష్ట్రవ్యాప్తంగా కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం
- నేడు కోడంగల్‌లో పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

2

శ్మశానంలో బతుకుతున్న అమృతకు బండి ఆపన్నహస్తం



బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

వివరాలు 3లో..

వాయుసేన ప్రపంచ రికార్డు!

- 13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా విమానం ల్యాండింగ్
- లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో చరిత్ర సృష్టించిన ఐఎల్-76ఎండీ
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఈ తరహా విమానం ల్యాండింగ్

4





ఈ20 పెట్రోల్‌పై మోదీ సమాధానం చెప్పాల్సిందే!

- నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ రాహుల్ గాంధీ ఆరోపణలు
- కొన్ని నమూనాల్లో 30 శాతం దాటిందన్న కాంగ్రెస్ అగ్రనేత

4

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలి

సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్

కాలుష్యానికి తావులేకుండా సురక్షితంగా వేడుకలు జరుపుకోవాలని పిలుపు

హైదరాబాద్, నవంబర్ 7 (ఉద్యమ కెరటం): శోభాయమానమైన దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపాల కాంతులు ప్రతి ఇంటా నిండి ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని వేర్వేరు సందేశాల్లో నేతలు ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం తన పాలన ద్వారా ప్రజల జీవితాల్లోని కష్టాల చీకట్లను పారద్రోలి, బతుకుల్లో కొత్త వెలుగులు నింపే లక్ష్యంతో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. పండుగ సంబరాల వేళ పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కాలుష్య రహితంగా సురక్షిత వాతావరణంలో వేడుకలు చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. అజ్ఞానపు చీకట్లను తొలగించుకుని జ్ఞానకాంతులను ఆహ్వానించాలనే మహత్తర సందేశాన్ని దీపావళి పండుగ అందిస్తోందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల కష్టాలన్నీ తొలగిపోయి సకల ఐశ్వర్యాలు, సర్వ సంపదలు చేకూరేలా, రాష్ట్రం తిరిగి ప్రగతి పథంలో పయనించేలా లక్ష్మీదేవి అమ్మవారి దివ్య కరుణాకటాక్షాలు లభించాలని ప్రార్థించారు. బాణాసంచా కాల్చే సమయంలో చిన్న పెద్ద అందరూ తగిన రక్షణ జాగ్రత్తలు వహిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా పండుగ జరుపుకోవాలని కేసీఆర్ సూచించారు.

బోస్టన్‌లో తెలంగాణ యువతి అదృశ్యం

నల్గొండ, నవంబర్ 7: అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న తెలంగాణకు చెందిన 23 ఏళ్ల యువతి అదృశ్యం కావడం కలకలం రేపింది. నల్గొండ జిల్లా కనగల్ మండలం శబ్దుల్లపురానికి చెందిన శ్రీజ రెడ్డి బోస్టన్‌లో కనిపించకుండా పోయింది. ఏడాదిన్నర క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఆమె అక్కడ చదువుకుంటూనే పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తోంది. ఇటీవల స్వగ్రామానికి వచ్చి నెల రోజుల పాటు కుటుంబ సభ్యులతో గడిపి తిరిగి అమెరికా వెళ్లింది. నవంబర్ 2న సాయంత్రం కాలేజీ నుంచి గదికి చేరుకున్న శ్రీజ వాకింగ్ కోసం బయటకు వెళ్లింది. సుమారు కిలోమీటరు నడిచిన తర్వాత ఆమె ఆచూకీ తెలియకుండా పోయింది. అప్పటి నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. నవంబర్ 3న పోలీసులకు ఫిర్యాదు అందగా, నవంబర్ 4న బోస్టన్ పోలీస్ శాఖ మిస్సింగ్ అలర్ట్ జారీ చేసింది. శ్రీజ ఆచూకీ గుర్తించేందుకు ప్రజల సహకారం కోరింది. కార్సన్ బీచ్, హార్బర్ పాయింట్ ప్రాంతాల్లో ఆమె ఉండే అవకాశాలపై పోలీసులు గాలిస్తున్నారు. చివరిసారిగా నల్లని జాకెట్, నీలిరంగు జీన్స్ ధరించినట్లు వివరాలు వెల్లడించారు. శ్రీజను సురక్షితంగా తీసుకొచ్చేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బోస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్, కేంద్ర విదేశాంగ శాఖ అధికారులతో పాటు స్థానిక పోలీసులను సంప్రదించారు. గాలింపు చర్యల్లో సహకరించాలని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ప్రతినిధులను కోరారు. మరోవైపు కుమార్తె ఆచూకీ తెలియక ఆమె తండ్రి కోయ యాదగిరిరెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీజ క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు.



4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు

రాష్ట్రవ్యాప్తంగా కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం

నేడు కోడంగల్‌లో పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్, నవంబర్ 7: తెలంగాణలోని నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పండుగ కానుక అందించనుంది. ప్రజా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మరో 4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. నవంబర్ 8న వికారాబాద్ జిల్లా కోడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వయంగా పాల్గొని, లబ్ధిదారులకు నూతన పింఛన్ల మంజూరు పత్రాలను అందజేయనున్నారు. సామాజిక భద్రతకు ప్రాధాన్యమిస్తూ కొత్త లబ్ధిదారుల ఎంపిక చేపట్టినట్లు మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత, గీత కార్మికులతో పాటు ఇతర అర్హులకు ఈ పింఛన్లు అందనున్నాయి. కోడంగల్‌లో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ పంపిణీ చేపట్టనున్నారు. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారు. కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు నవంబర్ నెల నుంచే పింఛన్ సొమ్మును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా పింఛన్లు అందిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. కొత్త పింఛన్ల మంజూరుతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది.

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే.. రైతులూ అప్రమత్తం!

మొదటి పేజీ తరువాయి

పాల్గొన్నారు. రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమై హకీంపేటలో నిర్మిస్తున్న విద్యా కేంద్రం పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో సాగునీటి పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ అంశాలపై మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుందని, అయితే తెలంగాణలో మాత్రమే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. రాబోయే వేసవిలో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టుల్లోని నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని వివరించారు. ఈ నేపథ్యంలో రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపాలని సూచించారు. రైతులు నష్టపోకుండా ముందుగానే అప్రమత్తం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీరు వెళ్తోందన్న బీఆర్ఎస్ ఆరోపణలను సీఎం ఖండించారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి పంపుహౌస్ నుంచి ఎత్తిపోతలు చేపట్టే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను దించే పరిస్థితి కూడా లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, నిర్మాణ లోపాల కారణంగానే కాళేశ్వరం పరిధిలోని మూడు బ్యారేజీలు పూర్తిస్థాయిలో పనిచేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల వంటి ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. పాలమూరు ప్రాంతం నుంచి గెలిచిన కేసీఆర్ భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ అక్కడి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే దెబ్బతిన్నదని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని తెలిపారు. ఆ సమావేశాల్లో ఎల్‌నినో ప్రభావం, కాళేశ్వరం ప్రాజెక్టు అంశాలపై సమగ్ర చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాల పెంపుపై కేటీఆర్ చేస్తున్న విమర్శలను సీఎం తిప్పికొట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ. 2 లక్షల పరిహారం ఇచ్చేందుకు కూడా అప్పటి ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ. 20 లక్షల వరకు పరిహారం అందిస్తోందని వెల్లడించారు. హైదరాబాద్--లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రముఖ పరిశ్రమలు ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. హకీంపేటలో 250 ఎకరాల్లో విద్యా కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.


గడ్డం పెంచితే రేవంత్ కాలేరు!

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వేషభాషలు మార్చుకున్నంత మాత్రాన ప్రజల విశ్వాసాన్ని పొందలేరని అన్నారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ ఎద్దేవా చేశారు. తాను మూడేళ్లుగా గంట కూడా సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నానని పేర్కొన్నారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే తమ తీర్పును వెల్లడించారని అన్నారు. అసత్య ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించడంతోపాటు ప్రజల సమస్యలను తెలుసుకుంటానని తెలిపారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురైతే ప్రజలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని చెప్పారు. రైతులు కూడా పరిస్థితులను అర్థం చేసుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని, సాగులో జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.



ధాన్యం నిల్వకు ఆధునిక సైలోలు

- తేమ పరీక్ష, శుభ్రపరచడం, ఆరబెట్టడం, నిల్వకు ఒకేచోట సదుపాయాలు
- పౌర సరఫరాల సంస్థ ద్వారా నేరుగా, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుకు రెండు నమూనాలు
- సచివాలయంలో ప్రతిపాదనలను సమీక్షించిన మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, నవంబర్ 7 : వరి ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో ఆరబెట్టి నాణ్యతను కాపాడుతూ ఎక్కువ కాలం భద్రపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోల వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. సచివాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైలోల నిర్మాణం, నిర్వహణ, నిధుల సమీకరణపై సమీక్షించారు. పంట కోత తర్వాత నిల్వ నష్టాలను తగ్గించడం, మార్కెట్‌లో ధర అనుకూలించే వరకు రైతులు ధాన్యాన్ని భద్రపరచుకునే వీలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ధాన్యాన్ని పెద్ద మొత్తంలో నేరుగా నిల్వ చేయగల భారీ ఉక్కు గిద్దంగులే సైలోలు. ప్రతిపాదిత సైలో కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసేందుకు తూకం వంతెనలు, తేమ, నాణ్యతను పరీక్షించేందుకు ప్రయోగశాల ఏర్పాటు చేయనున్నారు. కేంద్రానికి వచ్చిన ధాన్యంలో మట్టి, చెత్త వంటి మలినాలను యంత్రాల సాయంతో తొలగిస్తారు. తేమ ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని డ్రయర్లతో ఆరబెట్టి, సురక్షిత నిల్వకు అనువైన స్థాయికి తేమను తగ్గిస్తారు. ఆరబెట్టిన ధాన్యాన్ని యాంత్రిక పరికరాల సాయంతో నేరుగా ఉక్కు సైలోల్లోకి తరలించి నిల్వ చేస్తారు. ఈ పద్ధతిలో గోనె సంచుల వినియోగం తగ్గుతుంది. నిల్వ సమయంలో ధాన్యం నాణ్యతను పరీక్షించేందుకు, పురుగుల బెడదను నియంత్రించేందుకు అవసరమైన ఏర్పాట్లనూ ప్రతిపాదించారు. మొదటి నమూనాలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ గుర్తింపు పొందిన ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సమీకరించి నేరుగా సైలోలను ఏర్పాటు చేయనుంది. రెండో నమూనాలో తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తించనున్న సుమారు 20 ప్రదేశాల్లో ప్రైవేటు పారిశ్రామికవేత్తలు సైలోలను ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తారు. పెట్టుబడులు ఆర్థికంగా ఆచరణ సాధ్యమయ్యేందుకు పౌర సరఫరాల సంస్థ నిర్దిష్ట కాలానికి అద్దె చెల్లింపుల హామీ ఇచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. సైలోల నిర్మాణ, నిర్వహణ వ్యయాలు, నిధుల సమీకరణ, అద్దె చెల్లింపు బాధ్యతలను అంచనా వేయాలని మంత్రి అధికారులను కోరారు. తక్కువ వడ్డీకి ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అనువైన ప్రదేశాలను గుర్తించి, ఆర్థిక, సాంకేతిక నిపుణులతో సంప్రదించి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేయాలన్నారు. పంట కోసిన సమయంలో ధాన్యంలో సాధారణంగా సుమారు 25 శాతం తేమ ఉంటుందని మంత్రి వివరించారు. ఆరబెట్టే, భద్రంగా నిల్వ చేసే సదుపాయాలు లేక చాలామంది రైతులు అప్పటి మార్కెట్ ధరకే, కొన్నిసార్లు కోత ముగిసిన 24 గంటల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. సైలో కేంద్రాల్లో శాస్త్రీయంగా ఆరబెట్టి నిల్వ చేసే వీలు కలిగితే రైతులు ధర అనుకూలించినప్పుడు ధాన్యాన్ని అమ్ముకోగలుగుతారని చెప్పారు. ప్రీమియం వరి రకాల ధాన్యంలో తేమ సుమారు 25 శాతం ఉన్నప్పుడు క్వింటాలుకు రూ. 3,500 నుంచి రూ. 4,500 వరకు ధర పలుకుతోందని మంత్రి పేర్కొన్నారు. అదే ధాన్యాన్ని శాస్త్రీయంగా ఆరబెట్టి తేమను సుమారు 12 శాతానికి తగ్గిస్తే క్వింటాలుకు రూ. 5,000 నుంచి రూ. 5,500 వరకు ధర పలికే అవకాశం ఉందని వివరించారు. జేఎస్ఆర్, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ వంటి తెలంగాణ వరి రకాలకు దేశీయ, విదేశీ మార్కెట్లలో ఆదరణ పెరుగుతోందని, కొన్ని మార్కెట్లలో జేఎస్ఆర్ బియ్యం బాస్మతి కంటే అధిక ధర పలుకుతోందని మంత్రి పేర్కొన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరికి మెరుగైన నిల్వ సదుపాయాలు కల్పించడం వ్యవసాయరంగ వృద్ధికి, రాష్ట్ర జీడీపీ పెరుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. మడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న తెలంగాణ లక్ష్యానికీ ఇది తోడ్పడుతుందన్నారు. సమీక్షలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర, అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దోచుకున్నది చాలక మళ్లీ అధికారం కోసం కలలు

- సీఎం కుర్చీ కోసం ప్రతిపక్ష నేత ప్రమాణస్వీకార రిహార్సల్స్
- ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు నింపుదాం
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి



హైదరాబాద్, నవంబర్ 7 (ఉద్యమ కెరటం): గతంలో ఇందిరమ్మ ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు, స్థలాలు మంజూరు చేస్తే నాటి బీఆర్ఎస్ పాలకులు వాటిని నిర్దాక్షిణ్యంగా కొల్లగొట్టారని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ధరణి పేరిట భూదోపిడీ, కాళేశ్వరం పేరిట భారీ అవినీతికి పాల్పడి రాష్ట్రానికి రూ. 8.25 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మిగిల్చారని ధ్వజమెత్తారు. ఆ అప్పుల కారణంగా నెలకు రూ. 6,500 కోట్లను ప్రజాప్రభుత్వం వడ్డీ రూపేణా చెల్లిస్తోందని వివరించారు. రంగారెడ్డి జిల్లా నందిగామలో ఎంపీడీవో కార్యాలయ ప్రారంభం, ఎమ్మార్వో కార్యాలయ భవన శంకుస్థాపనతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి కష్టపడుతుంటే, మరోవైపు రానున్న కాలంలో తానే సీఎం అవుతానన్న భ్రమతో ఓ ప్రముఖుడు ఇప్పటినుంచే ప్రమాణస్వీకారోత్సవానికి రిహార్సల్స్ వేస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రెండేసి జిల్లాలను పంచుకుని దోపిడీకి పాల్పడిన నేతలు ఇప్పుడు నాలుగేసి జిల్లాలు కావాలంటూ ఒత్తిడి తెస్తున్నారని, వారి కలలు కల్లలు కాక తప్పవని అన్నారు. ముందు నీ నియోజకవర్గంలో గెలిచి, ఆ తర్వాత సీఎం పీఠం గురించి ఆలోచించాలని హితవు పలికారు. ప్రజా ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేయకపోతే తల వేయి ముక్కలవుతుందన్న భయంతో ప్రతిపక్ష నేతలు అసత్యాలు చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వపు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను కొనసాగించడమే ప్రజా ప్రభుత్వ భేషజాలు లేని పాలనకు నిదర్శనమన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు రూ. 73 వేల కోట్లను సున్నా వడ్డీకి డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని, ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు మంజూరు చేసిన 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో 2,25,100 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రానున్న కాలంలో మరిన్ని ఇళ్లు ఇస్తామన్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లలో ఆనందోత్సాహాలు జరుపుకునేందుకు శనివారం నుంచి 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరిట వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సచివాలయంలో హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలోనూ ఈ పండుగ రూపకల్పనను ఆయన స్పష్టం చేశారు.

'భూభారతి' సంస్కరణలు.. నందిగామకు వరాలు

ధరణి లోపాలను సరిదిద్ది భూసమస్యలు లేకుండా చేసేందుకు 'భూభారతి' పేరిట సంస్కరణలు తెస్తున్నామని, ఏడాదిన్నరలో 10,456 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి ప్రతి భూమికి పట్టా, మ్యాప్‌లతో పాటు ఆధార్ నంబర్ తరహాలో ప్రత్యేక 'భూధార్' నంబర్ ఇస్తామని వెల్లడించారు. ఈనెల 19న సిద్దిపేట వేదికగా చిలక పచ్చరంగు బతుకమ్మ చీరలను మహిళలకు అందజేస్తామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే శంకరన్న అభ్యర్థన మేరకు నందిగామకు ఆర్డీవో కార్యాలయ భవనం, ఎమ్మార్వో కార్యాలయ భవనం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సిద్ధాపురంలో డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలిస్తామని, వెంగిరాల, వెంజెళ్ల ప్రాంతాల్లోని భూసమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కేంద్రంగా హైదరాబాద్

■ 'ఆర్థా ఫిన్‌టెక్' కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, నవంబర్ 7 : ఫిన్‌టెక్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌లో పరిశోధన, అభివృద్ధి(ఆర్ అండ్ డీ)కి ప్రోత్సాహం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న ఆర్థా ఫిన్‌టెక్ హైదరాబాద్ కార్యాలయాన్ని హైటెక్ సిటీలో ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఐటీ/ఐటీఈఎస్ రంగంలో హైదరాబాద్ సాధించిన అంతర్జాతీయ గుర్తింపును ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలకూ విస్తరించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా పెట్టుబడులకు, ఆవిష్కరణలకు, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌కు దేశంలోనే అత్యుత్తమ గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. గ్లోబల్ కంపెనీలు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించేలా ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ ఎకో సిస్టం"ను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. బ్యాంకింగ్-యాజ్-ఏ-సర్వీస్, ఓపెన్ బ్యాంకింగ్ ఏపీఐలు, ఆటోమేటెడ్ అన్‌బోర్డింగ్, కేవైసీ/కేవైబీ, ఏఎంఎల్, అంతర్జాతీయ చెల్లింపులు, డిజిటల్ వాలెట్ మౌలిక సదుపాయాలు తదితర ఫైనాన్షియల్ టెక్నాలజీ పరిష్కారాలను ఆర్థా ఫిన్‌టెక్ అందిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. కార్యక్రమంలో కంపెనీ సీఈవో మధుబాబు గడిపాటి, ఆర్మిన్ ఒర్డోడరీ, ఇమాన్యుయేల్ సి. ఫెర్నాండెస్ తదితరులు పాల్గొన్నారు.

ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలి

- అటవీ సంపదతోపాటు ఆదివాసీల జీవనోపాధికి ప్రాధాన్యం
- అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ సీఎస్‌తో మంత్రి సీతక్క సమీక్ష



ములుగు, నవంబర్ 7 : ములుగు జిల్లాలో విస్తారంగా ఉన్న అటవీ, ప్రకృతి సంపదను పరిరక్షిస్తూనే పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి స్థానిక ఆదివాసీ గిరిజనులకు జీవనోపాధి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. అటవీ సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ములుగులో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ములుగు జిల్లాకు వచ్చిన జయేష్ రంజన్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి సీతక్కతో శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అటవీ ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ, ఎకో టూరిజం అభివృద్ధి, ఏజెన్సీ ప్రాంతాల మౌలిక వసతులు, ఆదివాసీ గిరిజనుల జీవనోపాధి తదితర అంశాలపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. జిల్లాకు ఉన్న ప్రత్యేక భౌగోళిక, ప్రకృతి వనరుల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని మంత్రి సూచించారు. జిల్లాలోని దట్టమైన అడవులు, కొండలు, వాగులు, జలపాతాలు, సహజసిద్ధమైన ప్రకృతి ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉన్నాయని, అయితే పర్యాటక అభివృద్ధి పేరుతో అటవీ సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడాలని సూచించారు. ప్రకృతిని కాపాడుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా ఎకో టూరిజం కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్థానిక ప్రజలను, ముఖ్యంగా ఆదివాసీ గిరిజనులను ఈ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను చేయడం ద్వారా వారికి స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించవచ్చన్నారు. స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ కళలు, ఆహార ఉత్పత్తులు తదితరాలను పర్యాటక రంగంతో అనుసంధానం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ములుగు ప్రకృతి సంపదను పరిరక్షించడంతో పాటు స్థానిక ప్రజల ఆదాయాన్ని పెంచే విధంగా అభివృద్ధి కొనసాగాలని అన్నారు. అటవీ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఇతర అత్యవసర మౌలిక వసతుల కోసం చేపట్టే అభివృద్ధి పనులకు కేంద్ర అటవీ, పర్యావరణ అనుమతుల ప్రక్రియలో అనవసర జాప్యం లేకుండా చూడాలని కోరారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలకు మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని జయేష్ రంజన్‌ను మంత్రి కోరారు. జిల్లా ప్రకృతి సంపదను భవిష్యత్ తరాలకు కాపాడుతూ అదే సమయంలో అక్కడి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ దిశగా అటవీ, పర్యావరణ శాఖతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓతోపాటు అటవీ, పర్యావరణ, జిల్లా పరిపాలనకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డిఫెన్స్ మద్యం అక్రమ విక్రయాలపై
ఎక్సైజ్ దాడులు

ఆల్వాల్ పరిధిలో రెండు చోట్ల తనిఖీలు

లోతుకుంటలో 96, బోయిన్‌పల్లిలో 67 బాటిళ్లు స్వాధీనం



హైదరాబాద్, నవంబర్ 7: డిఫెన్స్ క్యాంటీన్ల ద్వారా మాజీ సైనికులకు తక్కువ ధరకు లభించే మద్యం అక్రమ విక్రయాలకు తెరలేపిన కొందరిపై ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టింది. క్యాంటీన్ల నుంచి మద్యం తీసుకొచ్చి ఇళ్లలో నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఆల్వాల్ ప్రాంతంలో రెండు చోట్ల దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 163 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్‌రావు నేతృత్వంలోని బృందం సరస్వతీనగర్, లోతుకుంటలో మన్యం నాగప్రసన్న, రామాంజనేయులు దంపతుల ఇంట్లో సోదాలు చేసింది. ఈ సందర్భంగా 96 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. మాజీ సైనికుడైన రామాంజనేయులు తనతో పాటు ఇతరుల మద్యం కోటా ద్వారా క్యాంటీన్ల నుంచి బాటిళ్లు తీసుకొస్తుండగా, భార్య నాగప్రసన్న వాటిని స్థానికులకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో ఆమెను అరెస్టు చేసి ఆల్వాల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. మరోవైపు న్యూ బోయిన్‌పల్లి సౌజన్య కాలనీలో ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ గణపతిరెడ్డి బృందం తనిఖీలు నిర్వహించింది. ముసిమి లెంక (39) ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 67 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. ఆమెను అదుపులోకి తీసుకుని ఆల్వాల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించింది. రెండు దాడుల్లో పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ. 2.11 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. డిఫెన్స్ క్యాంటీన్ల ద్వారా లభించే మద్యం వెసులుబాటును దుర్వినియోగం చేస్తూ అక్రమ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

తెలంగాణ ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1,625 పీజీ సీట్లు

కొత్తగా 359 సీట్లకు జాతీయ వైద్య కమిషన్ ఆమోదం

హైదరాబాద్, నవంబర్ 7: తెలంగాణలో వైద్య విద్య, ప్రభుత్వ వైద్య సేవల విస్తరణకు మరో ముందడుగు పడింది. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అదనంగా 359 పీజీ సీట్లను కేటాయించేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆమోదం తెలిపింది. దీంతో ఇప్పటివరకు 1,266గా ఉన్న పీజీ సీట్ల సంఖ్య 1,625కు చేరింది. గతంలో రాష్ట్రంలోని 10 ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే పీజీ కోర్సులు అందుబాటులో ఉండగా, తాజా అనుమతులతో ఆ సంఖ్య 23కు పెరిగింది. మొత్తం 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 23 చోట్ల పీజీ విద్య అందుబాటులోకి రానుంది. నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, వనపర్తి, మంచిర్యాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, ఖమ్మం, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, నిర్మల్, సంగారెడ్డి, నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తొలిసారిగా పీజీ సీట్లు మంజూరయ్యాయి. కాలేజీల్లో అధ్యాపకుల నియామకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త భవనాల నిర్మాణం, అనుబంధ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాల కల్పనతో అదనపు సీట్లకు మార్గం సుగమమైంది. జాతీయ వైద్య కమిషన్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వసతులు మెరుగుపడటంతో ఈ అనుమతులు లభించాయి. పీజీ సీట్ల పెంపుతో జిల్లా కేంద్రాల్లోనే వివిధ వైద్య విభాగాల నిపుణులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల సంఖ్య పెరిగితే స్థానిక ప్రజలకు మెరుగైన చికిత్స అందుతుంది. ఎంబీబీఎస్ పూర్తిచేసిన రాష్ట్ర విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే ఉన్నత వైద్య విద్యను అభ్యసించేందుకు అవకాశాలు విస్తరిస్తాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని 1,625 పీజీ సీట్లతో పాటు నిమ్స్‌లో అదనంగా 107, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో 106 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ సుమారు 2,600 పీజీ సీట్లు ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి.

శ్మశానంలో బతుకుతున్న అమృతకు బండి సంజయ్ ఆపన్నహస్తం!

బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

తక్షణమే ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరిన బండి



సిరిసిల్ల, నవంబర్ 7 (ఉద్యమ కెరటం): సొంత ఇల్లు లేక స్మశానమే నివాసంగా మార్చుకుని అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడితో కలిసి దుర్భర జీవితాన్ని గడుపుతున్న చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన మర్రిపల్లి అమృతకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బాసటగా నిలిచారు. అమృతకు తక్షణ సాయంగా రూ.50 వేలు పంపారు. ఈ నగదు మొత్తాన్ని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ద్వారా బాధితురాలకు అందజేశారు. దీంతోపాటు జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ తో కేంద్ర మంత్రి ఫోన్లో మాట్లాడుతూ అమృత దుస్థితిని వివరించారు. అమృతకు తక్షణమే డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. మరోవైపు అనారోగ్యం బారిన పడిన కొడుకుతో కలిసి శ్మశానంలో నివసిస్తూ పుట్టెడు దుఃఖంలో ఉన్న అమృతకు అన్ని విధాలా అండగా ఉండాలని బండి సంజయ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరైన వెంటనే ఆ ఇంటికి అవసరమైన సామాగ్రితోపాటు కుటుంబానికి సరిపడా నిత్యావసర సరుకులను అందించాలని కోరారు.

సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ దోపిడీ

కొడంగల్-నారాయణపేట-మక్తల్ టెండర్లలో పాంగులేటి కంపెనీకి లబ్ధి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ



హైదరాబాద్, నవంబర్ 7 : కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవహారంపై ఆయన సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. తలకిందులుగా పడినా తమదే గెలుపు అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారం ఉందని వ్యాఖ్యానించారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం టెండర్లు పిలిస్తే మంత్రి పొంగులేటికి చెందిన సొంత కంపెనీ కూడా టెండర్లలో పాల్గొన్నదని ఆరోపించారు. మిగతా కంపెనీలన్నీ కాగితాలపైనే ఉన్న నామమాత్రపు సంస్థలని, చివరకు ఒక్క కంపెనీ మాత్రమే పోటీలో మిగిలి విజయం సాధించేలా వ్యవహారం నడిచిందని విమర్శించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం భారీగా పెరిగిపోవడంపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.6,825 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. అంటే దాదాపు ఐదు రెట్లు వ్యయం పెరిగిందని, ప్రజాధనాన్ని ఈ స్థాయిలో ఖర్చు చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ప్రాజెక్టు ద్వారా ఒక్క చుక్క నీరు కూడా అందలేదని విమర్శించారు. అంచనా వ్యయాన్ని భారీగా పెంచుతూ టెండర్ల ప్రక్రియను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. టెండర్లలో పారదర్శకతకు తావులేకుండా తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు దక్కేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని మండిపడ్డారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంటే మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించి ఇలాంటి దోపిడీకి సరిపోయే కొత్త పదాన్ని సూచించాలని కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. జరుగుతున్న ఈ దోపిడీని వివరించడానికి క్రోనీ క్యాపిటలిజం, బహిరంగ దోపిడీ, క్లెప్టోక్రసీ వంటి పదాలు కూడా సరిపోవడం లేదని వ్యాఖ్యానించారు.

డిండి నీటి సమస్యకు నదుల అనుసంధానమే పరిష్కారం

ఏదుల నుంచి డిండికి నీళ్లు తేవడం అసాధ్యం

బస్వాపూర్ మీదుగా గోదావరి జలాల తరలింపు

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



నల్గొండ, నవంబర్ 7: డిండి రిజర్వాయర్‌కు ఏదుల నుంచి నీటిని తరలిస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రెండు జిల్లాల ప్రజలను మోసం చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఏదులకే రెండు టీఎంసీల నీటిని తీసుకురాలేని పరిస్థితుల్లో డిండికి ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. శనివారం డిండి రిజర్వాయర్ వద్ద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తన ప్రతిపాదనలను వివరించారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతోనే డిండి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కాళేశ్వరం అదనపు టీఎంసీ ద్వారా బస్వాపూర్ మీదుగా డిండికి నీటిని అందించవచ్చని తెలిపారు. బస్వాపూర్ పనులు 80 శాతం పూర్తయ్యాయని, వాటిని వేగంగా ముగించాలని సూచించారు. ఏదుల నుంచి నీటిని తరలించే ప్రతిపాదనకు అవసరమైన సర్వేలు, సాంకేతిక ఆధారాలు ఏమిటో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిసార్లు సర్వేలు చేసినా డిండికి నీటి వనరును గుర్తించలేకపోయిందని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు శ్రీశైలాన్ని సోర్స్‌గా ఎంచుకోవడం కూడా తప్పిదమేనని అంగీకరిస్తూ, గత ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నందుకు క్షమాపణలు కోరారు. ఏటా గోదావరి నుంచి 3,500 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నా వినియోగించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కొత్త ప్రతిపాదనలు చేపట్టడం సరికాదన్నారు. నల్గొండలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి దీర్ఘకాలం నదీ జలాలు అందించాలని, జిల్లాలో చిన్న రిజర్వాయర్లు నిర్మిస్తామని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పరిష్కారాలు సూచిస్తున్న తమ పార్టీ అభ్యర్థులకు పట్టభద్రులు మద్దతు ఇవ్వాలని కవిత కోరారు.

పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ

సొంత ఆదాయాన్ని నేరుగా ఖాతాల్లో జమ చేసుకునే వెసులుబాటు

హైదరాబాద్, నవంబర్ 7: గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీలు వివిధ మార్గాల ద్వారా సమకూర్చుకునే సొంత ఆదాయాన్ని ఇకపై నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు తెలంగాణ పంచాయతీరాజ్ (నాలుగో సవరణ) చట్టం-2026ను తీసుకొచ్చింది. అక్టోబర్ 9, 2026 నుంచి ఈ సవరణ అమల్లోకి వస్తుందని పేర్కొంటూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో ఎంఎస్ నెం.43ను జారీ చేసింది. గతంలో గ్రామ పంచాయతీలు సొంతంగా సమకూర్చుకున్న ఆదాయాన్ని తొలుత ప్రభుత్వ ఖజానాలో జమ చేయాల్సి వచ్చేది. ఆ తర్వాత అవసరమైన నిధులను తిరిగి పొందేందుకు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండటంతో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురయ్యేవి. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రహదారుల మరమ్మతులకు నిధులు అందడంలో జాప్యం జరిగేది. ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం చట్ట సవరణ చేపట్టింది. కొత్త నిబంధనలతో పంచాయతీల సొంత ఆదాయం నేరుగా వాటి బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. దీంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించుకునే అవకాశం కలగనుంది.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

సంపాదకీయం



రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడనుందా?

త్వరలోనే భారీ శాంతి ఒప్పందం కుదరవచ్చన్న ట్రంప్

చర్చలకు ఇరు దేశాలు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడి

యూరప్ భద్రత, నాటో పాత్రపైనా కీలక నిర్ణయాలకు అవకాశం

ప్రమాదకర ప్రతిపాదనలపై అప్రమత్తంగా ఉండాలన్న జెలెన్‌స్కీ


ఏళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇరు దేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ఒక ఒప్పందానికి రావడానికి ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. త్వరలోనే భారీ శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం కేవలం రష్యా, ఉక్రెయిన్‌లకే పరిమితం కాకుండా యూరప్ దేశాల భద్రతకు సంబంధించిన అంశాలను కూడా కలిగి ఉండవచ్చని తెలిపారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రత్యేక ప్రతినిధి కిరిల్ దిమిత్రివ్‌తో వైట్‌హౌస్‌లో సమావేశమైన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాలు యుద్ధానికి ముగింపు పలికేందుకు ఒకే వేదికపైకి రావడానికి సిద్ధంగా ఉన్నట్లు తనకు అనిపిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య శాంతి నెలకొల్పే దిశగా పెద్ద ఒప్పందం కుదరవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందం యూరప్ మొత్తానికి సంబంధించిన అంశాలను కూడా కలిగి ఉండే అవకాశం ఉందన్నారు. అయితే చర్చల ప్రతిపాదనలు, ఒప్పందం అమలుకు సంబంధించిన వివరాలు ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది. శాంతి ఒప్పందంలో యూరప్ భద్రత, నాటో పాత్ర, భవిష్యత్తులో మరోసారి యుద్ధం తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య నెలకొన్న వివాదానికి శాశ్వత పరిష్కారం లభించాలంటే భద్రతాపరమైన హామీలు కీలకమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో యూరప్ దేశాల భాగస్వామ్యం కూడా చర్చల్లో ప్రధాన అంశంగా మారవచ్చని ట్రంప్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. మరోవైపు అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ అప్రమత్తంగా స్పందించారు. రష్యా, యూరప్ మధ్య భద్రతా ఒప్పందం కుదుర్చుకోవడం అంత సులభమైన విషయం కాదని పేర్కొన్నారు. కొన్ని ప్రతిపాదనలు భవిష్యత్తులో ప్రమాదకర పరిణామాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. యుద్ధాన్ని ముగించే ఒప్పందం కుదరాలంటే ముందుగా ఇరు దేశాల మధ్య ఉన్న ప్రధాన సమస్యలకు పరిష్కారం లభించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై ట్రంప్ వ్యక్తం చేసిన ఆశాభావం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే శాంతి ఒప్పందం కుదిరేందుకు ఇరు దేశాల అంగీకారంతోపాటు భద్రతా హామీలు, వివాదాస్పద అంశాలపై స్పష్టత అవసరం. ట్రంప్ వ్యాఖ్యలతో శాంతి ప్రయత్నాలపై ఆశలు పెరిగినప్పటికీ, అధికారిక ఒప్పందం కుదిరే వరకు యుద్ధం ముగింపుపై అనిశ్చితి కొనసాగనుంది.

ఈ20 పెట్రోల్‌పై మోదీ సమాధానం చెప్పాల్సిందే!

- నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ రాహుల్ గాంధీ ఆరోపణలు
- కర్ణాటకలో పరీక్షించిన 14 నమూనాల్లో 11 చోట్ల అధిక మోతాదు గుర్తించినట్లు వెల్లడి
- కొన్ని నమూనాల్లో 30 శాతం దాటిందన్న కాంగ్రెస్ అగ్రనేత
- మైలేజీ తగ్గి వాహనదారులపై అదనపు భారం పడుతోందని విమర్శ
- ఇంధనంలో ఇథనాల్ శాతం ఎందుకు వెల్లడించడం లేదని నిలదీత



న్యూఢిల్లీ, నవంబర్ 7 (ఉద్యమ కెరటం): దేశవ్యాప్తంగా వినియోగిస్తున్న ఈ20 పెట్రోల్‌లో నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మాత్రమే ఉంటుందని కేంద్రం చెబుతుండగా, వాస్తవంగా అంతకంటే ఎక్కువ మోతాదులో కలుపుతున్నట్లు కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాహనదారుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఇంధన సరఫరా జరుగుతోందని ఆరోపిస్తూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కర్ణాటక ప్రభుత్వం ఏడు జిల్లాల్లోని పెట్రోల్ బంకుల నుంచి సేకరించిన 14 నమూనాలను గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరీక్షించగా, వాటిలో 11 నమూనాల్లో 20 శాతానికి మించి ఇథనాల్ ఉన్నట్లు తేలిందని రాహుల్ గాంధీ వెల్లడించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన ఒక నమూనాలో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం నమూనాలో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలతోపాటు ప్రైవేటు సంస్థల నమూనాల్లోనూ నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ ఉన్నట్లు ఆరోపించారు. పెట్రోల్‌లో ఇథనాల్ మోతాదు పెరగడం వల్ల వాహనాల మైలేజీ తగ్గడంతోపాటు కొన్ని వాహనాల్లో నిర్వహణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధిక ధరలకు పెట్రోల్ కొనుగోలు చేస్తున్న ప్రజలు మైలేజీ తగ్గితే మరింత ఆర్థిక భారం భరించాల్సి వస్తుందని విమర్శించారు. ముఖ్యంగా పాత వాహనాలు, అధిక ఇథనాల్ మిశ్రమాలకు అనుగుణంగా రూపొందించని ఇంజిన్లపై ప్రభావం ఎలా ఉంటుందో ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనంలో వాస్తవంగా ఎంత శాతం ఇథనాల్ ఉందో వినియోగదారులకు తెలియజేసే పారదర్శక వ్యవస్థ లేకపోవడాన్ని రాహుల్ తప్పుబట్టారు. ప్రజలు కొనుగోలు చేస్తున్న ఇంధన నాణ్యత, మిశ్రమం గురించి తెలుసుకునే హక్కు వారికి ఉందని పేర్కొన్నారు. చమురు సంస్థల సొంత ప్రయోగశాలల పరీక్షలకు, కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల ఫలితాలకు మధ్య వ్యత్యాసం ఎందుకు వచ్చిందో వివరించాలని డిమాండ్ చేశారు. ఈ20 పేరుతో విక్రయిస్తున్న పెట్రోల్‌లో వాస్తవంగా ఎంత శాతం ఇథనాల్ కలుపుతున్నారు? నిర్దేశిత పరిమితిని మించినట్లు తేలితే సంబంధిత చమురు సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? వాహనదారులకు జరుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఇథనాల్ మిశ్రమ వివరాలను బహిరంగంగా ఎందుకు ప్రకటించడం లేదు? అంటూ రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు. ఇథనాల్ మిశ్రమ విధానం వల్ల నిజంగా ఎవరికి ప్రయోజనం కలుగుతోందో కేంద్రం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించినట్లు పేర్కొన్న పరీక్షల ఫలితాలపై స్వతంత్ర పరిశీలన జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ఈ20 పెట్రోల్‌పై రాహుల్ చేసిన ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే నమూనాల పరీక్షల వివరాలు, ఇథనాల్ మోతాదుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, చమురు సంస్థల అధికారిక వివరణతోనే పూర్తి స్పష్టత రానుంది.



దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు!

న్యూదిల్లీ, నవంబర్ 7 (ఉద్యమ కెరటం): పవిత్రమైన దీపావళి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి జీవితాలు నిత్యం సుఖసంతోషాలతో, సకల విజయాలతో కాంతివంతంగా వెలిగిపోవాలని ఆయన ఆకాంక్షించారు. చెడుపై మంచి, చీకటిపై వెలుగు సాధించిన మహోన్నత విజయానికి దీపావళి పండుగ దివ్య ప్రతీక అని చెప్పారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా శనివారం ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. 'ఈ పవిత్రమైన దీపావళి పర్వదినం మీ జీవితాల్లో నిరంతరం ప్రశాంతతను, ఉన్నత విజయాలను, అలరారే సుఖసంతోషాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు. కాగా, గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రధాని మోదీ తన దీపావళి పండుగను సరిహద్దుల్లో దేశాన్ని రక్షిస్తున్న వీర సైనికులతో కలిసి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా అదే ఆనవాయితీని, సంప్రదాయాన్ని కొనసాగిస్తూ సైనికుల మధ్యనే దీపావళి సంబరాలను జరుపుకోనున్నట్లు ఆయన తన వీడియో సందేశంలో స్పష్టంగా వెల్లడించారు.

క్రమశిక్షణే సైనికుడిని యోధుడిగా మారుస్తుంది

రాజ్‌నాథ్ సింగ్!



కొల్‌కతా, నవంబర్ 7 (ఉద్యమ కెరటం): కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాయుసేన సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బాగ్‌డోగ్రా ఎయిర్‌ఫీల్డ్‌లో నిర్వహించిన వేడుకల్లో సైనికులకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. భారత వైమానిక దళ సిబ్బంది ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రశంసించారు. మన సాయుధ దళాలు సరిహద్దుల్లో రేయింబవళ్లు కాపలాగా ఉండటం వల్లే, దేశ ప్రజలు ప్రతి పండగను ఆనందంగా, స్వేచ్ఛగా జరుపుకొంటున్నారని తెలిపారు. వారు చూపే ధైర్యం, నిస్వార్థ సేవకు యావత్ దేశం ఎంతో గర్వపడుతోందన్నారు. 'ఆపరేషన్ సిందూర్'తో మన వాయుసేన శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు. 'సైనికులలో ధైర్యం, క్రమశిక్షణ లేకపోతే అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా అది నిష్ప్రయోజనమే. మన సాయుధ దళాలు క్రమశిక్షణకు మారుపేరు. అదే ఒక సాధారణ సైనికుడిని అసాధారణ యోధుడిగా మారుస్తుంది. అదే సమయంలో డ్రోన్లు, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలతో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలతో సాయుధ దళాలను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది. మీ అందరి సహకారంతో భారత్ మరింత ముందుకు వెళ్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలో పెరుగుతోన్న రక్షణ ఉత్పాదక సామర్థ్యాలను రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి వల్లే దేశీయ స్టార్టప్‌లు, పరిశ్రమలు.. డ్రోన్‌లు, డ్రోన్ నిరోధక వ్యవస్థలు, సైనికుల కోసం అధునాతన పరికరాలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో అన్ని రకాల ఆయుధాలు, క్షిపణులను సొంతంగా తయారు చేసుకునే స్థాయికి భారత్ ఎదగాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ధైర్యముంటే నాపైకి బుల్డోజర్లు పంపండి

బీజేపీకి మమత సవాల్

కొల్‌కతా, నవంబర్ 7 (ఉద్యమ కెరటం): తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఇంటిపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. తమకు ఎదురు తిరిగిన వారిపైకి బుల్డోజర్లు పంపడం భాజపాకు అలవాటని దుయ్యబట్టారు. వారి దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉంటే అన్నీ తనపైకి పంపాలని సవాల్ చేశారు. 'మీ దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉన్నాయి? రండి, నేను మీ ముందే నిల్చొని ఉన్నాను. నాపై బుల్డోజర్లను నడపండి. మీరెంత ధైర్యవంతులో చూడాలనుకుంటున్నాను' అని భాజపాపై విమర్శలు గుప్పించారు. అభిషేక్‌ను ఆయన నివాసంలో పరామర్శించిన అనంతరం మమత ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ.. తృణమూల్ నేతలపై దాడులు చేయడమే కాకుండా కాళీఘాట్ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా జరుగుతోన్న కాళీ పూజలకు అంతరాయం కలిగిస్తోందని మమత ఆరోపించారు. పలు ప్రాంతాల్లో పూజలు నిర్వహించడానికి అనుమతులు రద్దు చేశారని.. కొన్ని చోట్ల ప్రధాన రహదారులపై పూజ చేసుకునేందుకు అనుమతిచ్చారని అన్నారు. ఈ మార్పులు ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం తెల్లవారుజామున కాళీఘాట్‌లో ఉన్న తన నివాసంపై భాజపా కార్యకర్తలు రాళ్లు, ఇటుకలతో దాడి చేసినట్లు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మమత ఆయన్ని పరామర్శించారు.



భారత వాయుసేన ప్రపంచ రికార్డు!

- 13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా విమానం ల్యాండింగ్
- లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో చరిత్ర సృష్టించిన ఐఎల్-76ఎండీ
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఈ తరహా విమానం ల్యాండింగ్
- అత్యంత క్లిష్టమైన వాతావరణంలోనూ సత్తాచాటిన భారత వైమానిక దళం
- చైనా సరిహద్దు సమీపంలో మరింత బలోపేతమైన వ్యూహాత్మక సామర్థ్యం



న్యూఢిల్లీ, నవంబర్ 7 (ఉద్యమ కెరటం): భారత వైమానిక దళం మరో అరుదైన ఘనత సాధించింది. సముద్ర మట్టానికి 13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా విమానాన్ని విజయవంతంగా దింపి సరికొత్త చరిత్ర సృష్టించింది. తూర్పు లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో భారత వైమానిక దళానికి చెందిన ఐఎల్-76ఎండీ భారీ రవాణా విమానం సురక్షితంగా దిగింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఈ తరహా విమానం ల్యాండింగ్ కావడం ఇదే తొలిసారని భారత వైమానిక దళం వెల్లడించింది. ఈ అద్భుత ఘట్టానికి సంబంధించిన చిత్రాలు, దృశ్యాలను సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకుంది. అత్యంత క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల్లో సాధించిన ఈ విజయం భారత వైమానిక దళ సాంకేతిక సామర్థ్యానికి, సిబ్బంది నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిందని పేర్కొంది. సాధారణంగా సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఉన్న ప్రాంతాల్లో విమానాల రాకపోకలు సవాళ్లతో కూడుకుని ఉంటాయి. అక్కడ గాలి సాంద్రత తక్కువగా ఉండటంతో విమాన ఇంజిన్ల పనితీరు, విమానాన్ని నియంత్రించే సామర్థ్యం ప్రభావితమవుతాయి. ముఖ్యంగా భారీ రవాణా విమానాలను దించడం, తిరిగి గాల్లోకి తీసుకెళ్లడం మరింత క్లిష్టమైన ప్రక్రియ. ఇలాంటి పరిస్థితుల్లో 13,629 అడుగుల ఎత్తులో ఉన్న న్యోమా వైమానిక స్థావరంలో ఐఎల్-76ఎండీ విమానాన్ని విజయవంతంగా దించడం విశేషంగా నిలిచింది. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పైలట్లు, సాంకేతిక సిబ్బంది ప్రదర్శించిన కచ్చితత్వం, సమన్వయం, వృత్తి నైపుణ్యాన్ని భారత వైమానిక దళం ప్రశంసించింది. తూర్పు లద్దాఖ్‌లోని న్యోమా ప్రాంతం భారత్-చైనా వాస్తవ నియంత్రణ రేఖకు సమీపంలో ఉండటంతో వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. సరిహద్దు ప్రాంతాల్లో సైనికుల తరలింపు, రక్షణ సామగ్రి రవాణా, అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలకు వైమానిక రవాణా కీలకంగా మారుతుంది. న్యోమా వంటి ఎత్తైన ప్రాంతాల్లో భారీ రవాణా విమానాలను నడపగల సామర్థ్యం పెరగడం ద్వారా సరిహద్దు ప్రాంతాలకు అవసరమైన సామగ్రిని మరింత సమర్థవంతంగా తరలించే అవకాశం ఉంటుంది. తాజా ల్యాండింగ్ భారత రక్షణ వ్యవస్థలో కీలక మైలురాయిగా నిలిచిందని వైమానిక దళం అభివర్ణించింది. ఐఎల్-76ఎండీ రష్యాలో రూపొందించిన నాలుగు ఇంజిన్ల భారీ రవాణా విమానం. సైనికులు, ఆయుధ సామగ్రి, వాహనాలు, ఇతర అవసరమైన సరకులను సుదూర ప్రాంతాలకు తరలించేందుకు దీనిని వినియోగిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో భారీ స్థాయిలో సామగ్రిని తరలించగల సామర్థ్యం ఈ విమానం ప్రత్యేకత. మారుమూల ప్రాంతాల్లో సైనిక కార్యకలాపాలకు మద్దతు అందించడంలోనూ ఈ విమానాలు కీలక పాత్ర పోషిస్తాయి. న్యోమా వైమానిక స్థావరంలో భారీ రవాణా విమానం విజయవంతంగా దిగడం భారత వైమానిక దళానికి గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘనత ద్వారా అత్యంత ఎత్తైన ప్రాంతాల్లోనూ సంక్లిష్టమైన వైమానిక కార్యకలాపాలు నిర్వహించగల సామర్థ్యాన్ని చాటుకున్నట్లు తెలిపారు. సిబ్బంది నైపుణ్యం, విమాన సామర్థ్యం, సమర్థవంతమైన ప్రణాళిక సమన్వయంతోనే ఈ విజయం సాధ్యమైందని వివరించారు.

రిమ్స్ వెంటిలేటర్ల చోరీ కేసు ఛేదన

- టెక్నీషియన్ల ముసుగులో వచ్చి చోరీ.. అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు
- ఇద్దరి అరెస్ట్.. మరో నిందితుడు పరారీ
- నాలుగు వెంటిలేటర్లతో పాటు ఇతర వైద్య పరికరాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో రూ.32 లక్షల విలువైన నాలుగు వెంటిలేటర్ల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఇద్దరిని అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గతనెల 30న మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన సజ్జన్ బసంత్ మోతే, అభిజిత్ అనే ఇద్దరు వ్యక్తులు టెక్నీషియన్ల ముసుగులో రిమ్స్‌లోకి ప్రవేశించి రెండో అంతస్తులోని ఆర్ఐసీయూ, సారీ వార్డుల నుంచి నాలుగు మైండ్ రే వెంటిలేటర్లను చోరీ చేశారు. అనంతరం వాటిని హైదరాబాద్‌కు చెందిన మెడికల్ పరికరాల వ్యాపారి కొండా రెడ్డికి విక్రయించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆదిలాబాద్ ఆర్టీఓ కార్యాలయం సమీపంలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మహారాష్ట్రలోని నాగభీడ్, వణి, నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ వైద్య పరికరాలు చోరీ చేసినట్లు వెల్లడైంది. నిందితుల నుంచి నాలుగు వెంటిలేటర్లు, మరో వెంటిలేటర్, ఎన్ఎస్‌టీ మిషన్, ఫీటల్ మానిటర్, డయాథెరపీ మిషన్, రూ.లక్ష నగదు, సెల్‌ఫోన్లు, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. రోగుల ప్రాణాలకు అవసరమైన వైద్య పరికరాలను చోరీ చేయడం తీవ్రమైన నేరమని ఎస్పీ పేర్కొన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వైద్య పరికరాల కొనుగోలు, విక్రయాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె.నాగరాజు, సీసీఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- క్వింటాలుకు రూ.15వేల ధర చెల్లించాలి: సీపీఎం డిమాండ్

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: మార్కెట్‌లో వ్యాపారుల దోపిడీతో నష్టపోతున్న పత్తి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం జిల్లా నాయకులతో కలిసి ఆదిలాబాద్ పత్తి మార్కెట్ యార్డును సందర్శించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పక్క జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో పత్తికి మెరుగైన ధరలు లభిస్తుండగా, ఆదిలాబాద్‌లో మాత్రం వ్యాపారులు ధరలు తగ్గిస్తూ రైతులను నష్టపరుస్తున్నారని తెలిపారు. ఇక్కడ క్వింటాలు పత్తికి రూ.8,680 ధర నిర్ణయించిన ప్పటికీ, తేమ శాతం ఎక్కువగా ఉందనే సాకుతో రూ.8,300, అంతకంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. లక్షెట్టిపేట, భద్రాచలం మార్కెట్లలో రూ.9వేలు, మహారాష్ట్రలో రూ.9,200, కర్ణాటకలో రూ.9,450 చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీసీఐ వెంటనే రంగంలోకి దిగి వాణిజ్యపరమైన కొనుగోళ్లు ప్రారంభించాలని, అందుకు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ చూపాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో పత్తి దిగుబడి తగ్గి రైతులు పెట్టుబడులు కూడా పొందలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాలుకు రూ.15వేల ధర చెల్లించడంతో పాటు తేమ పేరుతో వ్యాపారులు ధరల్లో కోతలు విధించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



రైతులంతా ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, పుసం సచిన్, ఆర్.మంజుల, ఎన్.స్వామి, రామన్న, ఆశన్న, ఆరిఫాబేగం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో కాగజ్‌నగర్ విద్యార్థుల ప్రతిభ

- స్మార్ట్ అటెండెన్స్ ట్రాకింగ్ సిస్టమ్ ప్రాజెక్ట్‌కు తృతీయ బహుమతి

ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్: రాష్ట్రస్థాయి జిజ్ఞాస విద్యార్థి ప్రాజెక్ట్ పోటీల్లో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఉన్నత విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసేందుకు నిర్వహించిన ఈ పోటీల్లో కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు రూపొందించిన 'స్మార్ట్ అటెండెన్స్ ట్రాకింగ్ సిస్టమ్' ప్రాజెక్ట్‌కు రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి తెలిపారు.



కళాశాల కంప్యూటర్ ఫ్యాకల్టీ సానియా మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఈ ప్రాజెక్టును రూపొందించారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా విజేతలకు రూ.12వేల నగదు బహుమతిని అందజేశారు. కాగా శనివారం కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జి.భవ్యశ్రీ, సిహెచ్.అంకిత, రచన, నదీం, వివేక్ చారిలను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.లక్ష్మీనరసింహం, అకాడమిక్ కోఆర్డినేటర్ డి.జనార్దన్, అధ్యాపకులు ఎం.రాజేశ్వర్, డాక్టర్ శారద, జిజ్ఞాస కోఆర్డినేటర్ డాక్టర్ వి.దేవేందర్, రోజ్ మేరీ, సానియా తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ జవాన్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ఇచ్చోడ మండలం జామిడి గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ జాదవ్ సాయికుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పట్ల తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ జిల్లా అధ్యక్షులు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం జామిడి గ్రామంలోని సాయికుమార్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ దేశ రక్షణకు సేవలందించిన యువ జవాన్ అకాల మరణం ఎంతో బాధాకరమని అన్నారు. దేశ సేవకు అంకితమైన సాయి కుమార్‌ను కోల్పోవడం తీరని లోటని, ఆయన మృతి గ్రామానికి, ప్రాంతానికి తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, మనోధైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు. కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా వర్షావాస్ సమాప్తి వేడుకలు



ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్: సిర్పూర్(టి) మండల కేంద్రంలో బౌద్ధ సమాజ్ ఆధ్వర్యంలో వర్షావాస్ సమాప్తి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ సాంప్రదాయాల ప్రకారం బుద్ధ పూజా పాట్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. మూడు నెలల పాటు కొనసాగిన వర్షావాస్ కార్యక్రమం ముగింపు సందర్భంగా బుద్ధుని బోధనలు, బౌద్ధ ధమ్మం గొప్పతనం, సమానత్వం, సోదరభావం, ఐకమత్యం వంటి మానవీయ విలువలను స్మరించుకున్నారు. బుద్ధుని ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బౌద్ధ సమాజ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు ఫుల్ ఝలే నాందేవ్, బసర్కార్ విశ్వనాథ్, డాక్టర్ సునీత-రావుజీ, నగరడే రాజు, దుర్గం తులసిరాం, దుర్గం శివరాం, దుర్గం విక్రమ్, మానేపల్లి ప్రభాకర్, నర్నారే కుశాల్, తాక్ సండే దేవిదాస్, కంమ్రే సురేష్, జాడి గణేష్, దుర్గం జయంత్, దుర్గం తిరుపతి, కొండగుర్లే హిరమన్, పుల్జాలే బండురావు, పిప్రే ప్రభాకర్, విశ్వాస్ జక్తాప్, కత్తెర్లే ఆత్మరావు, కొండగుర్లే దేవాజి, చాహరే గోవిందరావు, కొండగుర్లే మారుతి, దుర్గం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించడమే లక్ష్యం



ఉద్యమ కెరటం, నేరడిగొండ: విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యమని ఎస్ఓ రజిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గైడ్ విద్యార్థులు ప్రత్యేక యూనిఫాంలో పాల్గొని పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సర్వమత ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం, సమాజం పట్ల బాధ్యత వంటి మంచి లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఆపద సమయంలో ఇతరులకు సహాయం చేయడం, సమాజంలో ఐక్యతను పెంపొందించడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు పీఈటీ స్నేహ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గైడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దండారి ఉత్సవాలు

ఆటాపాటలతో మార్మోగిన గ్రామం




ఉద్యమ కెరటం, నేరడిగొండ: ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దండారి (గుస్సాడి) ఉత్సవాలు మండలంలోని నాగమల్యాల్ గ్రామంలో శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాంప్రదాయ వేషధారణలు, ఢోలు వాయిద్యాలు, గుస్సాడి నృత్యాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆదివాసీ కళాకారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో నాగమల్యాల్ సర్పంచ్ గోడం నందిని అమృత్, లఖంపూర్ సర్పంచ్ సేడ్మాకి సుజాత గంగాధర్, పీచర సర్పంచ్ బైరి లింగవ్వ రాజేందర్, నాగమల్యాల్ పటేల్ కోవా గంగారాం, దేవరీలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఆదివాసీల ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించడంలో దండారి ఉత్సవాలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. ఇలాంటి సాంప్రదాయ వేడుకలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తూ ఆదివాసీ సంస్కృతి వైభవాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

రైతుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి

ఆత్మహత్యల నివారణకు విస్తృత అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ఎల్‌నినో ప్రభావంతో పంట నష్టపోయిన రైతుల్లో భరోసా కల్పించాలని, పంట రుణాల రీషెడ్యూలింగ్‌పై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. రైతుల ఆత్మహత్యల నివారణకు గ్రామస్థాయిలో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శనివారం సంబంధిత శాఖల అధికారులు, డీఆర్‌డీఓ, జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఎంపీడీఓలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో రైతుల సంక్షేమం, పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, ఆత్మహత్యల నివారణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో 33 శాతానికి పైగా పంట నష్టం జరిగిన రైతుల వివరాలను వ్యవసాయ శాఖ వేగంగా సేకరించి సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. రైతులు తీసుకున్న పంట రుణాలను బ్యాంకుల ద్వారా రీషెడ్యూల్ చేసేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ వెసులుబాటుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయక చర్యలు, బ్యాంకులు కల్పిస్తున్న రుణ సదుపాయాలపై రైతులకు సరైన సమాచారం చేరవేయాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించాలి, విస్తృత ప్రచారం చేపట్టాలని డీపీఓ, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రైతుల్లో ఉన్న అపోహలు, ఆందోళనలను తొలగించి ధైర్యం కల్పించాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆత్మహత్యల నివారణకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం పింఛన్ దరఖాస్తులు, దివ్యాంగుల యూడీఐడీ ధ్రువీకరణ పత్రాలు, బీడీ కార్మికుల పింఛన్లపై సమీక్షించారు. అనర్హులు, సందేహాస్పదంగా ఉన్న కేసులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ జరపాలని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

దండారి వేడుకల్లో సందడి చేసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఉద్యమ కెరటం, జైనూర్: మండలంలోని సుకుడ్‌పల్లి, దేవుగూడ, జాంగం, మని జండాగూడ, గుడామామడ, పాట్నపూర్ గ్రామాల్లో ఆదివాసీల సాంప్రదాయ పండుగ దండారి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై గ్రామస్తులతో కలిసి దండారి నృత్యంలో పాల్గొన్నారు. గోండు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా యువకులు, మహిళలు ప్రదర్శించిన దండారి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామస్తులు ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ పెద్దలు, ఆదివాసీ సంఘాల నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై హరీశ్ రావు ఆగ్రహం

ఉద్యమ కెరటం, సిద్దిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు అన్నారు. సిద్దిపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు కారణంగా 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, మిగిలిన పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా దొడ్డు వడ్లు పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లోని ధాన్యం తడిసి కొట్టుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రాల్లో ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు, టార్పాలిన్లు, తేమ కొలిచే పరికరాలు అందుబాటులో లేవని, ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీల టెండర్లు, మిల్లుల కేటాయింపులు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తుండగా, తెలంగాణలో మాత్రం నష్టంపై కనీస అంచనాలు కూడా రూపొందించడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులకు వచ్చే సొంత ఆదాయాన్ని ఆర్థిక శాఖ నిలిపివేయడంతో కనీస మరమ్మతులు కూడా చేపట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. షెడ్లు, తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్ల వంటి కనీస సౌకర్యాలు కరువయ్యాయని తెలిపారు. మార్కెటింగ్ శాఖలో ఖాళీలను భర్తీ చేయకుండా ఒకే అధికారికి నాలుగు జిల్లాలు, 20 మార్కెట్ల బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. సిద్దిపేటలో ఖాళీగా ఉన్న మార్కెట్ సెక్రటరీ, జిల్లా మార్కెటింగ్ అధికారి పోస్టులను వెంటనే భర్తీ చేసి శాశ్వత అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు.



సిర్సిల్క్ బాధితుల పక్షాన ప్రశ్నిస్తే రాజకీయం ఎలా అవుతుంది

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సమాధానం చెప్పాలి: గోలెం వెంకటేశం

ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్: సిర్సిల్క్ పరిశ్రమ మూతపడటంతో నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు గోలెం వెంకటేశం అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ బాధితుల పక్షాన నిలబడి ప్రశ్నిస్తే రాజకీయం ఎలా అవుతుందని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు బాధితుల సమస్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో రెండు ప్రధాన పరిశ్రమలతో పారిశ్రామిక ప్రాంతంగా వెలుగొందిన సిర్పూర్ నియోజకవర్గం నేడు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందన్నారు. సిర్సిల్క్ పరిశ్రమ మూతపడినప్పటి నుంచి బాధితులకు న్యాయం జరగలేదని అన్నారు. కోసిని, గంగారం బస్తీ, విజయ్ బస్తీ, చింతగూడ ప్రాంతాలకు చెందిన బాధితులకు రావాల్సిన బకాయిలు ఇప్పించడంలో ప్రజాప్రతినిధులు ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. ఐదు దశాబ్దాలుగా నివాసముంటున్న పేద కుటుంబాలకు ఇంటి పట్టాలు అందించాలని కోరారు. నియోజకవర్గంలో సాగునీటి సౌకర్యం కల్పించి రైతులకు రెండో పంట సాగు చేసే అవకాశం కల్పించాలని, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిర్పూర్ పేపర్ మిల్లు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సిర్పూర్ మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణంతో పాటు రహదారులు, వంతెనలు, బస్సు సౌకర్యాలు మెరుగుపర్చాలని, పోడు రైతులకు పట్టాలు అందించాలని సూచించారు. ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థలను బలోపేతం చేయాలని అన్నారు. సిర్సిల్క్ పరిశ్రమ మూతపడటంతో నష్టపోయిన సుమారు 3వేల కుటుంబాలకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, బాధితులకు జారీ చేసిన నోటీసులను ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ప్రతిపక్ష నాయకులపై విమర్శలు చేయడం మానుకొని, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ పోషం, మాజీ కౌన్సిలర్ మీనాజ్, నక్క మనోహర్, బీఆర్ఎస్ యువ నాయకులు కాశిపాక రాజు, వసకే హనుమంతు, కోసిని ఉప సర్పంచ్, మెరుగు రాజేష్, రేణుకుంట్ల శ్రీనివాస్, బండి వాసు, తాండ్ర నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఓటరు జాబితాలో పేరు తొలగింపునకు గురైన వారికి మరో అవకాశం

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగింపునకు గురైన వారికి తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎస్‌డీ జాబితాలో పేర్లు ఉన్నవారు మరోసారి ఎన్యుమరేషన్ ఫారం నింపి సమర్పించడం ద్వారా ఓటరు జాబితాలో తమ పేరును పునరుద్ధరించుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్న అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్ మాట్లాడుతూ ఏఎస్‌డీ జాబితాను ప్రతి పోలింగ్ కేంద్రం, గ్రామపంచాయతీ నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు, ఓటర్లందరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఏఎస్‌డీ జాబితాలో పేర్లు ఉండి, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు నిబంధనల ప్రకారం ఫారం-సి ద్వారా మరోసారి ఎన్యుమరేషన్ ఫారం సమర్పించవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియపై నియోజకవర్గ, జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పూర్తి వివరాలను తెలియజేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా చర్యలు చేపట్టి, ఈనెల 21వ తేదీలోగా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితాలో పేరు తొలగింపునకు గురైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు రెవెన్యూ కలెక్టర్ ఆర్ఎస్.చిత్రు, డీఆర్ఓ స్రవంతి, ఎన్నికల పర్యవేక్షణ అధికారి నలందప్రియ, నాయబ్ తహశీల్దార్ మధుసూదన్, వివిధ మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.





ముదిరాజుల హక్కుల సాధనకు సమరభేరి

- 12న ఓయూలో నిర్వహణ.. భారీగా తరలిరావాలని అనిత ముదిరాజ్ పిలుపు

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: ముదిరాజుల హక్కుల సాధన కోసం ఈనెల 12న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న ముదిరాజ్ సమరభేరిని విజయవంతం చేయాలని ఓయూ విద్యార్థిని నాయకురాలు అనిత ముదిరాజ్ పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ముదిరాజులు వేలాదిగా తరలిరావాలని కోరారు. శనివారం గంభీరావుపేట మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం మండల శాఖ అధ్యక్షుడు శాత్రబోయిన లక్ష్మణ్ ఆధ్వర్యంలో సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని, ముదిరాజ్ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.20కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో తగిన రిజర్వేషన్లు కల్పించాలని, 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ముదిరాజులకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం నిర్వహించనున్న సమరభేరికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ముదిరాజుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాము, పీఏసీఎస్ చైర్మన్ చొప్పదండి రామచంద్రం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్క హన్మండ్లు, ముదిరాజ్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పిట్టల భూమేష్, బీసీ స్టడీ సర్కిల్ జిల్లా డైరెక్టర్ జిల్లా వెంకటస్వామి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి పిట్ట బాబు తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ సాంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి

దండారీ వేడుకల్లో ఆత్రం సుగుణ

ఉద్యమ కెరటం, జైనూర్: ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. మండలంలోని పోచంలొద్ది గ్రామపంచాయతీ పరిధిలోని దేవ్‌గూడ, పవర్‌గూడ గ్రామపంచాయతీల్లో శనివారం నిర్వహించిన గుస్సాడీ, దండారీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలకు గుస్సాడీ, దండారీ వేడుకలు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని తెలిపారు. గుస్సాడీ, దండారీ కళాకారులకు అవసరమైన షెడ్ల నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ రషీద్, సర్పంచులు మనోహర్, రాజేందర్, ముబారక్, ఆదివాసీ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నూతన ఎస్సై బాలరాజుకు ఘన సన్మానం



ఉద్యమ కెరటం, గంభీరావుపేట: గంభీరావుపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన బాలరాజును గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై బాలరాజుకు శాలువా కప్పి సత్కరించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలను అభినందించారు. నూతన ఎస్సై ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దేవసాయి కృష్ణ, గ్యార దేవరాజ్, రాజా నర్సు, ఎగదండి స్వామి, శ్రీమతి, యూత్ నాయకుడు మహమ్మద్ ఆమెర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు నిండాలి

ఏఎంసీ చైర్మన్ మహమ్మద్ హమీద్



ఉద్యమ కెరటం, గంభీరావుపేట: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని గంభీరావుపేట మండల ప్రజలందరికీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మహమ్మద్ హమీద్ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ ప్రతిఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రతిఒక్కరూ ఇళ్లలో దీపాలు వెలిగించడంతో పాటు మనసుల్లో ప్రేమ, ఆప్యాయత, సోదరభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పండుగలు సమాజంలో ఐక్యత, మతసామరస్యం, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మండలంలోని రైతులు, వ్యాపారులు, కార్మికులు, యువత, మహిళలు సహా అన్నివర్గాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి దీపావళిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. ముఖ్యంగా రైతుల కుటుంబాల్లో సిరిసంపదలు వెల్లివిరియాలని, పాడిపంటలతో గ్రామాలు సుభీక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మండల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరిస్తూ ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

దీపావళి వేడుకలను సురక్షితంగా జరుపుకోవాలి

గంభీరావుపేట ఎస్సై బాలరాజు



ఉద్యమ కెరటం, గంభీరావుపేట: దీపావళి పండుగను మండల ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా జరుపుకోవాలని గంభీరావుపేట ఎస్సై బాలరాజు సూచించారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. బాణసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చేలా చూడాలని పేర్కొన్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ఇళ్ల సమీపంలో బాణసంచా కాల్చరాదన్నారు. ప్రమాదకరమైన బాణసంచాకు దూరంగా ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, రోడ్లపై బాణసంచా కాల్చి ఇతరులకు ఇబ్బందులు కలిగించరాదని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా, ఇతరులకు అసౌకర్యం కలిగించకుండా బాధ్యతాయుతంగా పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ దరఖాస్తులు వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాములు



ఉద్యమ కెరటం, మంచిర్యాల: ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ దరఖాస్తులు, ఫైళ్ల పరిష్కారం వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి, ఆర్డిఓ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆయన మాట్లాడుతూ జీఓ. నం.76 కింద వచ్చిన దరఖాస్తుల పురోగతి, జీఓ. నం.59 దరఖాస్తుల పరిష్కారం, భూసేకరణ ప్రక్రియ, భూ భారతి ఫైళ్ల పరిష్కారం, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు. ఆయా అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఫైళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులు, ఫైళ్ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దీత గడువులోగా త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ సంబంధిత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షణే లక్ష్యం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

తహఫుజ్ ఖత్మే నబువ్వత్‌ను సమాజంలో బలోపేతం చేయండి



- ఇస్లాం ముసుగులో సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండండి
- ఖాధియాని, షకిలియత్ వర్గాల బారిన పడి మోసపోకండి..
- గ్రామీణ ప్రాంత ముస్లింల ఈమాన్ విశ్వాసాన్ని కాపాడే యజ్ఞంలో బాగస్వామ్యులు కండి
- ముస్లిం సమాజానికి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపు

కరీంనగర్, నవంబర్ 7 (ఉద్యమ కెరటం): ప్రస్తుత పరిస్థితుల్లో ఖాధియాని, షకిలియత్ వర్గాల నుంచి ముస్లిం సమాజాన్ని మేలుకొలుపి, వారి బారి నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఉమ్మతే మహమ్మదీయా (మహమ్మద్ ప్రవక్త సల్లం అనుచరులపై) ఉందని మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఫియాస్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో కశ్మీర్ గడ్డలోని ఒక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బేసిక్ ఆఫ్ ఇస్లాం అనే అంశంపై ఇటీవల నిర్వహించిన టాలెంట్ టెస్టు నిర్వహించగా, గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా మౌలానా అర్షద్ అలీ ఖాస్మి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తను చిట్ట చివరి ప్రవక్తగా అంగీకరించకుంటే ముస్లిం కాలేదని, విశ్వాసం ఈమాన్ నుండి బహిష్కృతులు అవుతారని చెప్పారు. ఇజ్రాయిల్, అంగ్లేయుల కనుసన్నల్లో భారత దేశంలో ఖాధియాని వర్గం పేరిట, షకిల్ వర్గం పేరిట కార్యకలాపాలను కొనసాగిస్తూ, ముస్లింల ముసుగులో, వేషధారణలతో అమాయక ముస్లింలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముస్లిం యువత ఇస్లాం గురించి పూర్తి స్థాయిలో తెలియకుండా ఖాధియాని, షకిలియత్ వర్గాలు ముస్లిం గురువులు, పండితులని నమ్మి, వారిబారిన పడి, ఇస్లాం, ఈమాన్ నుండి తమంతట తాము బహిష్కృతులు అవుతున్నారని, ఇంత పెద్ద ఘటన ఇది వీరికి తెలియకుండానే జరిగిపోతుందన్నారు. ఖాధియాని, షకిలియత్ వర్గాలను స్వీకరించి, వారు చెప్పిన బాటలో నడుస్తూ జీవితం గడిపి, ఒకవేళ మరణిస్తే కాఫీర్ గానే పరిగణించబడుతారని, ఖయామత్ ప్రళయదినం రోజు లేపబడుతారని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ముస్లింలను చేరదీసి, వారి ఈమాన్ విశ్వాసాన్ని కాపాడేందుకు మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు చేస్తున్న ఈ బృహత్తర యజ్ఞంలో ప్రతి ఒక్కరూ తమ విధిగా, బాధ్యతతో పాలుపంచుకొని, తోడ్పాటునందించాలని కోరారు. ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అలుపెరుగకుండా గ్రామీణ ప్రాంతాల్లో ముస్లింల, ఈమాన్, విశ్వాసాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నారని అభినందించారు. ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్ కు కరీంనగర్ నగర ముస్లిం సమాజం అండగా నిలబడి, మజ్లీస్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు లో తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి, అమాయక గ్రామీణ ముస్లింలను ఇస్లాం నుండి మరలిపోకుండా కాపాడే యజ్ఞంలో మహమ్మద్ ప్రవక్త అనుచరులుగా మనసా, వాచా, ఖర్మనా సేవలు అందించాలని పిలుపు నిచ్చారు. ఈసదస్సుకు ఉమ్మడి జిల్లా నుండి, నగర ఇస్లామీయ ధార్మిక పండితులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో హఫీజ్ వసిముద్దీన్, మౌలాన కాజిమ్, మౌలాన నయిమ్, హాఫిజ్ రిజ్వాన్, హాఫిజ్ సాధక్ అలీ, ఖత్మే నబువ్వత్ కరీంనగర్ సేవకులు హాఫిజ్ అహ్మద్ హిప్జి, కలిమ్ షరీఫ్, హాఫిజ్ ఫరిదోద్దీన్, హాఫిజ్ అబ్దుల్ రాఫె, హాఫిజ్ తౌహీద్, హఫీజ్ ఇమ్రాన్ బేగ్, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ



కరీంనగర్, నవంబర్ 7 (ఉద్యమ కెరటం): మజిలీస్ తహఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో బేసిక్ ఆఫ్ ఇస్లాం అనే అంశంపై నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో అత్యధిక మార్కుల పొందిన విజేతలకు కాశ్మీర్ గడ్డలోని ఓ ఫంక్షన్ హాల్ లో, మజ్లీస్ తహఫుజ్ ఖత్మే నబువ్వత్ ఉభయ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి, ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. మదర్సా ఇస్లాహిల్ బనాత్ హుస్సేనిపురకు చెందిన విద్యార్థిని ఖవుల మొదటి బహుమతిని గెలుచుకున్నారు. మొదటి విజేతకు పదివేల నగదు తో పాటు ఒక గిఫ్ట్ ఒక జ్ఞాపికను అందజేశారు. ఉమెన్స్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని సన అనే విద్యార్థినికి రెండవ బహుమతి దక్కింది. రెండో బహుమతి కింద 7వవేల నగదు ఒక గిఫ్ట్ తో పాటు జ్ఞాపికను అందజేశారు. మదర్సా ఇస్లాహిల్ బనాత్ కు చెందిన సనా ఫర్హిన్ అనే విద్యార్థిని మూడవ విజేతగా నిలిచారు. మూడవ బహుమతిగా 5వేల నగదు ఒక గిఫ్ట్ తో పాటు ఒక జ్ఞాపికను అందజేశారు. 80 మార్కులు 90 మార్కులు సాధించిన విద్యార్థులకు సైతం కన్సోలేషన్ బహుమతులను అందజేశారు.

న్యాయం చేయండి!



- మా భూమిని మాకు దక్కనివ్వాలంటూ బాధితురాలి వేడుకోలు
- 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని అక్రమంగా పట్టామార్పిడి చేశారని ఆరోపణ
- భర్త సమాధి ఉన్న స్థలాన్నీ దూరం చేస్తున్నారని ఆవేదన
- కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించిన మాధవి
- భూ రికార్డుల్లో అక్రమాలపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి

కరీంనగర్, నవంబర్ 7 (ఉద్యమ కెరటం): "అయ్యా.. మా భూమిని మాకు దక్కనివ్వండి. మూడు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూమిని ఇతరులు తమ పేర్లపై మార్చుకున్నారు. నా భర్త సమాధి ఉన్న స్థలాన్ని కూడా నాకు దూరం చేయాలని చూస్తున్నారు. నాకు న్యాయం చేయండి" అంటూ మాధవి అనే బాధిత మహిళ అధికారులను వేడుకున్నారు. తమ కుటుంబానికి చెందిన భూమిని అక్రమంగా పట్టామార్పిడి చేయించుకున్నారని ఆరోపిస్తూ కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ తన ఆవేదనను పంచుకున్నారు.

మూడు దశాబ్దాలుగా మా సాగులోనే ఉంది..

మాధవి తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె మామ మద్ది మల్లయ్య చెంజర్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 568/అ/2లో ఉన్న 2 ఎకరాల 3 గుంటల భూమిని బోల్ల పరమేశ్వరయ్య వద్ద సాదాబైనామా ద్వారా కొనుగోలు చేశారు. అప్పట్లో పట్టామార్పిడి చేయించుకోకపోవడంతో భూమి రికార్డుల్లో పాత యజమాని పేరే కొనసాగింది. అనంతరం భూమి విక్రయించిన పరమేశ్వరయ్యతోపాటు కొనుగోలు చేసిన మల్లయ్య కూడా మరణించారు. మల్లయ్య ఐదుగురు కుమారుల్లో తన భర్త రాజు ఒకరని, కుటుంబ వాటాగా ఆయనకు 15 గుంటల భూమి వచ్చిందని మాధవి తెలిపారు.

భర్త సమాధి ఉన్న భూమినైనా వదిలేయండి..

తన భర్త రాజు మరణించిన అనంతరం ఆయనకు అదే భూమిలో సమాధి నిర్మించినట్లు మాధవి వివరించారు. సుమారు 30 ఏళ్లుగా ఆ భూమి తమ సాగు, స్వాధీనంలోనే ఉందని పేర్కొన్నారు. భర్త జ్ఞాపకాలతో ముడిపడిన భూమిని కూడా దక్కకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చనిపోయిన యజమాని పేరుతో పట్టామార్పిడి?

అసలు భూ యజమాని పరమేశ్వరయ్య మరణించి 17 ఏళ్లు గడిచాయని, ఈ విషయాన్ని ఆసరాగా చేసుకుని అదే గ్రామానికి చెందిన మద్ది లక్ష్మయ్య అక్రమాలకు పాల్పడ్డారని మాధవి ఆరోపించారు. పరమేశ్వరయ్య అనే పేరున్న మరో వ్యక్తిని అసలు యజమానిగా చూపించి రెవెన్యూ అధికారుల సహకారంతో మొత్తం 2 ఎకరాల 3 గుంటల భూమిని తన పేరుపై పట్టామార్పిడి చేయించుకున్నారని పేర్కొన్నారు. అనంతరం అక్టోబర్ 17న తన వారసులైన మద్ది రవి, మద్ది మధు, మద్ది కుమార్‌ల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు.

సీపీ సారూ.. న్యాయం చేయండి!

తమ కుటుంబానికి చెందిన భూమిని కాపాడాలని మాధవి పోలీస్ కమిషనర్‌ను కోరారు. భూమి కొనుగోలు వివరాలు, పాత రికార్డులు, పట్టామార్పిడి, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించి అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భర్తను కోల్పోయిన తనకు ఆయన వాటాగా వచ్చిన భూమిని కూడా దూరం చేయవద్దని వేడుకున్నారు. బాధితురాలి ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు, రెవెన్యూ అధికారుల వివరణ తెలియాల్సి ఉంది. భూ రికార్డులపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. "మాకు ఇతరుల భూమి వద్దు.. మా భూమిని మాకు దక్కేలా న్యాయం చేయండి" అంటూ మాధవి చేస్తున్న విజ్ఞప్తిపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.





ఐఓఏ అథ్లెట్ల కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు

ఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్ల కమిషన్ నూతన నాయకత్వం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. స్టార్ షట్లర్ పి.వి.సింధు ఐఓఏ అథ్లెట్ల కమిషన్ ఛైర్‌పర్సన్‌గా.. భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అగ్రశ్రేణి వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, స్విమ్మర్ సాజన్ ప్రకాశ్ ఐఓఏ సర్వసభ్య సమావేశానికి అథ్లెట్ల కమిషన్ ప్రతినిధులుగా ఎంపికయ్యారు. ఈ నాలుగు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో అభ్యర్థులంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి సంజయ్ శ్రీవాస్తవ ప్రకటించారు. ఈ నలుగురు క్రీడాకారులు 2026–2030 కాలానికి గాను నాలుగేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. డిసెంబరు 5న ఐఓఏ ఎన్నికల అనంతరం ఏర్పాటయ్యే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సింధు, హర్మన్‌ప్రీత్ సభ్యులుగా చేరతారు. ఐఓఏ సర్వసభ్య సమావేశం ప్రతినిధులుగా ఎన్నికైన చాను, సాజన్.. డిసెంబరు 5న జరిగే ఎన్నికల్లో ఓటు వేసే హక్కు కలిగి ఉంటారు. పది మంది సభ్యులతో కూడిన ఐఓఏ అథ్లెట్ల కమిషన్‌లో సలీమా టెటె (హాకీ), స్వప్నిల్ కుసాలె (షూటింగ్), భవానీ దేవి (ఫెన్సింగ్), తజిందర్‌పాల్ సింగ్ తూర్ (షాట్‌పుట్), బొంబేలా దేవి (ఆర్చరీ), మంజీత్‌సింగ్ (కయాకింగ్–కనోయింగ్) సభ్యులుగా ఉన్నారు.



ధోనీని 'మాహీ అంకుల్' అని పిలుస్తా: నటి అనుష్క సేన్

కెప్టెన్' కూల్ ఎంఎస్ ధోనీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆయనను ఒక్కసారైనా నేరుగా చూడాలని ఎంతోమంది ఆశపడుతారు. అలాంటి ధోనీతో తనకు చిన్ననాటి నుంచి ప్రత్యేక అనుబంధం ఉందని నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అనుష్క సేన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆయనను తాను ప్రేమగా 'మాహీ అంకుల్' అని పిలుస్తానని.. ధోనీ తనను చిక్కీ అని అంటారని తెలిపారు. గతంలో ధోనీతో కలిసి పలు వాణిజ్య ప్రకటనల్లో నటించడం వల్ల తమ మధ్య మంచి అనుబంధం ఏర్పడిందన్నారు. పదేళ్ల క్రితం మొదటిసారి ధోనీని కలిసినప్పటి విషయాలను ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తామిద్దరం రాంచీ నుంచే వచ్చామన్నారు. ధోనీతో కలిసి తాను ఏడేళ్లపాటు 21 ప్రకటనల్లో నటించానని తెలిపారు. ఇప్పటికీ ఎక్కడైనా కలిస్తే.. ఆయన ఎంతో ప్రేమగా దగ్గరకు తీసుకుంటారన్నారు. 'యహా మై ఘర్ ఘర్ ఖేలీ' సీరియల్‌తో అనుష్క సేన్ ఏడేళ్లకే తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించారు. అనేక వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 'బాల్ వీర్'లో మెహర్ పాత్ర ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. దేవోంకే దేవ్ మహదేవ్, ఝాన్సీ కీ రాణి వంటి వాటిల్లో నటించారు.

ధినిధికి మరో కాంస్యం

డకార్ (సెనెగల్): యూత్ ఒలింపిక్ గేమ్స్‌లో భారత యువ స్విమ్మర్ ధినిధి దేశింగు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒకే ఎడిషన్‌లో రెండు వ్యక్తిగత పతకాలు నెగ్గిన భారత తొలి అథ్లెట్‌గా రికార్డు కెక్కింది. మహిళల 100 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచిన ఈ 16 ఏండ్ల కర్ణాటక అమ్మాయి 200 మీటర్ల పోటీలనూ కాంస్య పతకాన్ని ముద్దాడింది. శుక్రవారం జరిగిన తుదిరేసును ధినిధి 2 నిమిషాల 02.28 సెకండ్లతో మూడో స్థానంతో ముగించింది.



ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించాలి



- జిల్లా కలెక్టర్ హరిత
- దంతన్‌పల్లిలో వైభవంగా 'దండారి గుస్సాడి' వేడుకలు
- ఆదివాసీ మహిళలతో కలిసి కలెక్టర్ సంప్రదాయ నృత్యం

ఉద్యమ కెరటం, తిర్యాణి: ఆదివాసీ కోలం గిరిజనుల విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జనజాతి గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి తిర్యాణి మండలం దంతన్‌పల్లి గ్రామంలో ఆదివాసీ కోలం గిరిజనుల మధ్య దండారి గుస్సాడి సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ దండారి నిర్వాహకులకు ప్రభుత్వం తరఫున రూ: 15,000 ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్ ఆదివాసీ మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యం చేసి ఆకట్టుకున్నారు. కోలం గిరిజనుల ఆచార వ్యవహారాలు, కళారూపాలను కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, జీవన విధానం ప్రత్యేక గుర్తింపును కలిగి ఉన్నాయని, ఆధునిక కాలంలోనూ పూర్వీకుల ఆచారాలను కాపాడుకోవడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నైతం కృష్ణారావు, మాడావి గోపాల్, జగ్గిరావు, ఎస్‌సీఆర్‌పీలు కుడ్మెత అనంత్, రాథోడ్ రవీందర్, కనక కైలాష్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, గిరిజన నాయకులు ఆత్రం లక్ష్మణ్, ఆత్రం గంగారాం, భీంరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.







దళారులను నమ్మి మోసపోవద్దు

జిల్లా కలెక్టర్ కె.హరిత



ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్: జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద పొరుగు సేవల ప్రాతిపదికన చేపట్టనున్న అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడీ ఆయా పోస్టులు, వైద్య ఆరోగ్య శాఖ లో భర్తీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుల భర్తీ విషయంలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశ చూపే దళారులు, మధ్యవర్తుల మాటలు నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, ఆయా పోస్టులు వైద్య ఆరోగ్య శాఖ లోభర్తీకి సంబంధించి దరఖాస్తు చేసుకున్న ప్రతి అభ్యర్థి వివరాలను సంబంధిత శాఖ అధికారులు నిర్దీత నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలిస్తారని, అభ్యర్థులు సమర్పించిన విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలు, సంబంధిత అర్హతలను పరిశీలించిన అనంతరం ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపిక ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పోస్టుల భర్తీలో ఎలాంటి అవకతవకలకు, సిఫార్సులకు, అక్రమ పద్ధతులకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. అభ్యర్థుల అర్హతలు, సమర్పించిన ధ్రువపత్రాలు, వర్తించే నిబంధనల ఆధారంగానే ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని, ఎవరికీ ప్రత్యేక ప్రాధాన్యత, అనధికారికంగా ఉద్యోగం కల్పించే అవకాశం ఉండదని తెలిపారు. ఎంపిక జాబితాలో పేరు వచ్చేలా చేస్తామని చెప్పి, అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, వ్యక్తిగతంగా సంప్రదించి ప్రలోభాలకు గురిచేసినా వారి మాటలు నమ్మి ఆర్థికంగా నష్టపోవద్దని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు, సేవా ప్రాతిపదికన చేపట్టే పోస్టుల భర్తీలో దళారులు, మధ్యవర్తుల ప్రమేయానికి ఎలాంటి అవకాశం లేదని, అభ్యర్థులు తమ అర్హతలు, సమర్పించిన దరఖాస్తులపై మాత్రమే ఆధారపడాలని, పోస్టుల భర్తీకి సంబంధించి ఏవైనా సందేహాలు, సమాచారం అవసరమైనప్పుడు సంబంధిత మహిళా, శిశు సంక్షేమ శాఖ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను నేరుగా సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, అధికారుల నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని, సోషల్ మీడియా, ఇతర అనధికారిక మార్గాలలో ప్రచారమయ్యే తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అంగన్వాడీ వ్యవస్థ ద్వారా మహిళలు, చిన్నారులకు అందించే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య తదితర సేవలు మరింత సమర్థవంతంగా అందించడంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాల పాత్ర ఎంతో కీలకమని, ఈ నేపథ్యంలో ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు

జిల్లా కలెక్టర్ కె హరిత

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్: జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ హరిత దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా ప్రతి ఇంట్లో సంతోషం, ఆనందం వెల్లివిరియాలని కోరారు. ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని, కాలుష్యాన్ని తగ్గించే విధంగా పండుగను జరుపుకోవాలని, బాణసంచా కాల్చే సమయంలో చిన్న పిల్లలు మహిళలు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు.



ఉచిత ప్రయాణం సరే... బస్సులు ఆపేదెప్పుడు?

నవేగాం, రాళ్ళపేట స్టేజ్ వద్ద బస్సులు ఆపాలి

కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బోర్కుటే శ్యాంరావ్

ఉద్యమ కెరటం, రెబ్బెన: నవేగాం బస్ రిక్వెస్ట్ స్టాప్ వద్ద ఆర్ టీ సీ బస్సులు ఆగకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై అధికారులు వెంటనే స్పందించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బోర్కుటే శ్యాంరావ్ డిమాండ్ చేశారు. నవేగాం గ్రామంలో గ్రామపంచాయతీ, రాళ్ళపేట స్టేజ్ రెండు గ్రామాల మధ్య ఒకటే రిక్వెస్ట్ బస్ స్టాప్ ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభించినప్పటి నుంచి ఈ రిక్వెస్ట్ బస్ స్టాప్‌లో ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు ఆగకపోవడంతో మహిళలు, వృద్ధులు, అత్యవసర పనులపై మండల కేంద్రమైన రెబ్బెన, జిల్లా కేంద్రం ఆసిఫాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపైనే ఎదురుచూడాల్సి వస్తోందని పేర్కొన్నారు.ప్రజారవాణా అనేది ప్రతి పౌరుడి హక్కు అని, గ్రామీణ ప్రాంత ప్రజల ప్రయాణ ఇబ్బందులను తీర్చేందుకు ఉన్నతాధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. అధికారికంగా రిక్వెస్ట్ బస్ స్టాప్ ఉన్నప్పటికీ బస్సులు ఎందుకు ఆపడం లేదని ఆర్టీసీ అధికారులను ఆయన ప్రశ్నించారు. ఈ సమస్యపై ఆర్టీసీ డిపో అధికారులు తక్షణమే స్పందించి, నిబంధనల ప్రకారం నవేగాం, రాళ్ళపేట వద్ద అన్ని బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోచయ్య తదితరులు పాల్గొన్నారు.





Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

కిరాణా షాప్ లో చోరీ

ఉద్యమ కెరటం, తాండూర్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ట్యాంక్ సమీపంలో గల కిరాణా షాప్ లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పురుషోత్తం తన కుటుంబ సభ్యులతో కలిసి కోరుట్లలో తన బంధువుల ఇంట్లో కార్యక్రమానికి శుక్రవారం ఉదయం 6.30 గంటలకు బయలుదేరి వెళ్లాడు. శనివారం సాయంత్రం నాలుగున్నర గంటలకు వచ్చి చూసేసరికి దుకాణం తాళం పగలగొట్టి ఉండడం గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లోని బీర్వలో గల రెండు తులాల బంగారం వస్తువులు, ఒక తులం వెండి బ్రాస్లెట్ తో పాటు రెండు క్వింటాళ్ల జై శ్రీరామ్ బియ్యం, టీవీ, రూ.5వేల విలువగల కిరాణా వస్తువులు తీసుకొనివెళ్లారని బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తాండూర్ ఎస్సై కె.ప్రసాద్ రావు ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలం వద్దకు చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్ఐఆర్ జాబితాలో పేరు లేని ఓటర్లకు మరో అవకాశం

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



ఉద్యమ కెరటం, మంచిర్యాల: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2026 ముసాయిదా జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 21వ తేదీలోగా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, డూప్లికేట్ (ఏఎస్‌డీఈ) కేటగిరీల్లో గుర్తించబడి ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులకు తుది జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందన్నారు. అర్హులైన ఓటర్ల జాబితాలను పోలింగ్ కేంద్రాలు, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సంబంధిత ఓటర్లను సంప్రదించి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయాలని, వాటిని సమర్పించే విధానంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇప్పటికే అదే చిరునామాలో నివసిస్తున్న ఓటర్లు సంబంధిత ప్రకటనతో పాటు ఎన్యుమరేషన్ ఫారం సమర్పించవచ్చని, రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మారిన వారు పాత, కొత్త చిరునామాలు, అసెంబ్లీ నియోజకవర్గ వివరాలతో పాటు నివాస ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని తెలిపారు. ఇందుకోసం అనుబంధం-ఎ,బి,సి ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, బీఎల్ఓ అధికారులకు ఫారాలు అందజేయవచ్చని పేర్కొన్నారు. ఈసీఐనెట్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే కొత్త ఓటరు నమోదుకు ఫారం-6 సమర్పించిన వారు తిరిగి ఎన్యుమరేషన్ ఫారం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మంచిర్యాల జిల్లాలో 1.15 లక్షల మంది ఏఎస్‌డీఈ కేటగిరీ ఓటర్లను గుర్తించి, సంబంధిత జాబితాలను బూత్ స్థాయి అధికారులకు అందజేసినట్లు తెలిపారు. అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించే ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తామని చెప్పారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను సంప్రదించి అవసరమైన ఫారాలు, ప్రకటన పత్రాల సమర్పణపై వివరించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ తుది ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్, జీపీఎఫ్ పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు

13న ఖమ్మం కలెక్టరేట్ లో అదాలత్-కమ్-వర్క్ షాప్

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



ఉద్యమ కెరటం, ఖమ్మం: పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెన్షన్, జీపీఎఫ్, అకౌంట్స్ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13న ఖమ్మం కలెక్టరేట్‌లోని ఐడీఓసీలో అదాలత్-కమ్-వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు. ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్, జీపీఎఫ్ కేసుల పరిష్కారం, పెన్షనర్ల సమస్యల పరిశీలనతో పాటు ఉద్యోగులు పెన్షన్ ప్రతిపాదనలను సకాలంలో సమర్పించే విధానంపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఏసీ బిల్లులు, పెండింగ్ వోచర్లు, ట్రెజరీ తనిఖీ అభ్యంతరాలు, చెల్లించిన చెక్కులకు సంబంధించిన వివరాలు, జీపీఎఫ్ పెండింగ్ అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, శాఖాధిపతులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు, జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీ అధికారులు తమ సిబ్బందితో కలిసి తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. పెండింగ్ పెన్షన్ ఫైళ్లు, సర్వీస్ బుక్కులు, జీపీఎఫ్ తుది చెల్లింపు దరఖాస్తులు, వోచర్లు, ఏసీ బిల్లుల క్లియరెన్స్ వివరాలు, ట్రెజరీ తనిఖీ అభ్యంతరాలకు సంబంధించిన నివేదికలతో పాటు అవసరమైన రికార్డులను వెంట తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్హులైన పెన్షనర్లకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్లు, జీపీఎఫ్ చందాదారులకు ఆథరైజేషన్ లేఖలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని పెన్షనర్లు, ఉద్యోగులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని, పెన్షనర్ల సంఘాలకు సమాచారం అందించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు

- లబ్ధిదారుల ఇంట కాంతులు నింపిన మంత్రి పొన్నం ప్రభాకర్



ఉద్యమ కెరటం, హుస్నాబాద్: దశాబ్ద కాలంగా సొంతింటి కల కోసం ఎదురు చూస్తున్న పేద కుటుంబాల జీవితాల్లో కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం కొత్త వెలుగులు నింపిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 12వ వార్డులో నిర్వహించిన 'మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులతో కలిసి పండుగ సంబరాలు జరుపుకున్నారు. గత పదేళ్లుగా సొంతిల్లు లేక ఇబ్బందులు పడుతున్న కోమల-సమ్మయ్య ముదిరాజ్ దంపతులకు ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. వారి నూతన గృహంలో నిర్వహించిన దీపావళి వేడుకలకు మంత్రి హాజరై ఇంటి యజమాని కోమలకు నూతన వస్త్రాలు, స్వీట్లు అందించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 2,500కు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఆయా ఇళ్లలో లబ్ధిదారులు దీపావళి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. రెండో విడతలో మంజూరైన మరో వెయ్యి ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ జారీ ప్రక్రియను వారం, పది రోజుల్లో పూర్తి చేస్తామని వివరించారు. రూఫ్ లెవల్‌లో ఉన్న లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతిఒక్కరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కోమల-సమ్మయ్య దంపతులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడ్డామని, ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో సొంతింటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. తమ ఇంట్లో మంత్రితో కలిసి దీపావళి జరుపుకోవడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని, అండగా నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, స్థానిక కౌన్సిలర్లు, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ఎత్తివేతకు 15 నుంచి రిలే దీక్షలు

- మచ్చ బొల్లారం చెత్తను తరలిస్తే ప్రజాగ్రహం తప్పదు: జేఏసీ చైర్మన్ షేక్ షావలి



ఉద్యమ కెరటం, జవహర్ నగర్: జవహర్ నగర్ డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15 నుంచి రిలే నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ (జేఏసీ) చైర్మన్ షేక్ షావలి ప్రకటించారు. శనివారం జవహర్ నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జేఏసీ చేపట్టిన ప్రజా ఉద్యమం ఫలితంగానే ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర, డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ప్రజలు ఆందోళనకు దిగకపోతే నాయకులు స్పందించేవారు కాదని పేర్కొన్నారు. జేఏసీ ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని, 30 గ్రామాలకు చెందిన సుమారు 40 లక్షల మంది ప్రజల ఆరోగ్యం, భద్రత కోసం పోరాడుతోందని స్పష్టం చేశారు. ఈనెల 3న నాగారం ఎంవైఆర్ గార్డెన్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో చర్చలు పూర్తికాకుండానే 108 రోజుల కార్యాచరణ ప్రకటించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు తరలింపునకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్), నిధులు, పర్యావరణ అనుమతుల రద్దుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ 15 రోజుల్లో సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. డంపింగ్ యార్డు తరలింపు గడువుతో కూడిన ప్రణాళికను లిఖితపూర్వకంగా ప్రకటించకపోతే రిలే దీక్షల అనంతరం కలెక్టరేట్ ముట్టడి, ప్రభావిత ప్రాంతాల్లో పాదయాత్రలు చేపడతామని హెచ్చరించారు. మచ్చ బొల్లారం ప్రాంతానికి చెందిన చెత్తను జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు తరలించేందుకు సర్వే నం.168లోని ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు వస్తున్న వార్తల్లో నిజం ఉంటే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ ప్రతినిధి వజ్రేష్ యాదవ్ నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం బాధ్యతలు నెట్టివేసుకోకుండా సమస్యను పరిష్కరించాలని కోరారు. జేఏసీ కో-కన్వీనర్ల సమావేశంలో భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. శాంతియుతంగా చేపట్టనున్న దీక్షలకు అన్నివర్గాల ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జేఏసీ గౌరవ సలహాదారు రావల్ కోల్ నర్సింహ గౌడ్, కోశాధికారి శివబాబు, కో-కన్వీనర్లు కొండల్ ముదిరాజ్, ఆలూరి రాజశేఖర్, గడ్డం సదానందం, శివనారాయణ, బిర్రు యాకస్వామి, బద్రగామి అంజనేయులు, మేక లలిత యాదవ్, వై.మల్లేష్, బండకింది సింగరాయ గౌడ్, జాన్, మహ్మద్ పాషామియా, జయసుధ, గడిపే సునీత, మహ్మద్ జావేద్, కొన్నె వేణు, వి. ప్రవీణ్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా నిరుపయోగంగా ప్రభుత్వ ఆసుపత్రి

- వారం రోజుల్లో ప్రారంభించాలని బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా



ఉద్యమ కెరటం, గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు కోడె రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.1.56 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆసుపత్రి భవనం పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా ప్రారంభించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఆసుపత్రి అందుబాటులో లేక పోవడంతో ప్రజలు వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిని వెంటనే ప్రారంభించడంతో పాటు వైద్యులు, సిబ్బంది, మందులు, అవసరమైన పరికరాలను సమకూర్చి 24గంటల పాటు అత్యవసర వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ మారుతి రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాపై స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఫోన్ ద్వారా బీజేపీ నాయకులతో మాట్లాడి వారం రోజుల్లో అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బందిని ఏర్పాటు చేసి ఆసుపత్రిని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు వారం రోజుల్లో ఆసుపత్రిని ప్రారంభించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేవసాని కృష్ణ, డాక్టర్ సత్యనారాయణ, మల్లేష్ యాదవ్, దేవేందర్ యాదవ్, గంట అశోక్, ఎలేందర్, నర్సింలు, పొన్నాల మహేష్, బండ దేవయ్య, స్వామి రాజు, సర్వోత్తమ్, రవీందర్ నాయక్, బాలయ్య, శ్రీనివాస్ చారి తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేరు నమోదుకు మరో అవకాశం

- ఈనెల 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించవచ్చు
- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



ఉద్యమ కెరటం, సిరిసిల్ల: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2026 ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన వారికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈనెల 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించవచ్చని తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సమావేశానికి రాజన్న సిరిసిల్ల జిల్లా ఐడీఓసీ నుంచి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులకు ఈ అవకాశం ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాల రూపంలో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. జాబితాలో పేర్లు చేర్చకపోవడానికి గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోనూ వివరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఓటర్లు పాత ఎపిక్ నంబర్ ఆధారంగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించవచ్చని తెలిపారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తహశీల్దార్లు మహేష్, జయంత్, ఎలక్షన్ సెక్షన్ అధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సులో భాగంగా బియ్యం ధరల నియంత్రణ

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ఉద్యమ కెరటం, మంచిర్యాల: ప్రజా శ్రేయస్సులో భాగంగా ప్రభుత్వం బియ్యం ధరల నియంత్రణ చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలోని బెల్లంపల్లి డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, మండల తహశీల్దార్ కృష్ణలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ప్రస్తుతం మార్కెట్లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రభుత్వ నిర్ణీత ధరకే విక్రయాలు జరిగేలా రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన బిపిటి న్యూరైస్ బ్యాగ్ ను రూ.1,326, పాత బియ్యంను రూ.1,612, హెచ్ఎంటి స్టీమ్ బియ్యం బస్తా రూ.1,872, జై శ్రీరామ్ పాత బియ్యం రూ.2,028 చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయాలు జరుపాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

